సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 17-1-2025 15/-

## మండుతున్న మధ్యప్రాచ్యం





పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావం ...!




## డ్రగ్స్ నిర్మూలన
## మత గురువుల కర్తవ్యం

సహజీవన భావాల పావురాయి

# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 3 హైదరాబాద్
శుక్రవారం 17 జనవరి 2025 రూ.15-00
16 రజబ్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

ఏ వ్యక్తి ప్రపంచంలో ద్వంద్వ స్వభావం ప్రదర్శిస్తాడో ప్రళయ దినాన అతని నోట్లో రెండు నిప్పు నాలుకలు వెలుస్తాయి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





14

**సహాయం**

## లోపల...


| | | |
|---|---|---|
| సినిమా | ...... | 04 |
| మండుతున్న మధ్యప్రాచ్యం | ...... | 05 |
| ప్రభావశీలురైన భారతీయ ముస్లింల జాబితాలో... | ...... | 08 |
| పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావం ...! | ...... | 10 |
| సుపరిపాలనకు సిసలైన చిరునామా... | ...... | 12 |
| భారత్‌లో మత విద్వేష మంటలు | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఇస్లామీయ ఉద్యమం దాని క్రమ వికాసం – 3 | ...... | 20 |
| దళితులు, ముస్లింలు ఏకం కావాలి | ...... | 23 |
| డ్రగ్స్ నిర్మూలన మత గురువుల కర్తవ్యం | ...... | 24 |
| కారుణ్య వ్యవస్థ ఇస్లామ్ | ...... | 26 |
| చరితార్థులు–2 : బతఖ్ మియాఁ అన్సారి | ...... | 28 |
| సమాజానికి పునాది కుటుంబం | ...... | 29 |
| సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి? | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| షాబాన్ మాసం దాని ప్రాముఖ్యత | ...... | 34 |


**ఉచ్చు బిగిసేనా...?**




కారురేసు కేసులోన
కేటియారు మెడకు
ఉచ్చు బిగుసుకుంది
మరి ఏమౌద్దో కడకు!
గులాబిసారు దృష్టిలో
ఇదొక లొట్టపీసు కేసు
ఏమిటో మరి ఆ ధీమా
ఉన్నదేంటో తిరకాసు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## సినిమా

**గత సంవత్సరం** వచ్చిన పెద్ద సినిమాలను చూస్తే మొత్తం పది సినిమాల్లో హిందీ బాలీవుడ్ సినిమాలు నాలుగు. మిగిలిన ఆరు తమిళ, తెలుగు సినిమాలు. దీన్ని బట్టి హిందీ సినిమా ప్రస్తుత పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే ఇక్కడ క్రియేటివిటి పేరుతో విద్వేషాన్ని అమ్ముకునే ధోరణి పెరుగుతోంది. ప్రేక్షకులు కూడా ఈ ఫార్ములాను ఇప్పుడు ఏవగించుకుంటున్నారు. ఈ విద్వేష ప్రచారాన్ని వాడుకుని ప్రాపగాండ సినిమాలు తీసి గత కొన్ని సంవత్సరాలుగా కొంతమంది చాలా డబ్బులు కూడా చేసుకున్నారు. కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ, గదర్ 2 సినిమాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

సోషల్ మీడియాలో, ఆ మాటకొస్తే మెయిన్ స్ట్రీమ్ మీడియాలో రోజు కనిపించే విద్వేషమే కొత్త మసాలాలతో వెండితెరపై వండి వార్చడం జరిగింది. ప్రజలు ఈ విద్వేష వరదలో కొట్టుకుపోతున్నారా? లేక తమ ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం గురించి ఆలోచిస్తున్నారా అన్నది ప్రశ్న.

సబర్మతి రిపోర్ట్ సినిమా అలాంటిదే. యోగీ ఆదిత్యనాథ్‌కు సహజంగానే ఈ సినిమా చాలా నచ్చేసింది. యు.పి.లో టాక్స్ ఫ్రీ చేసేశారు. ఈ సినిమా బాక్సాఫీసు వద్ద బోల్తా కొడుతున్నప్పుడు ప్రధానమంత్రి తన మంత్రివర్గ సహచరులతో కలిసి సినిమా చూశారు. అయినా బాక్సాఫీసు కలెక్షన్లు పెరగలేదు. దీనికన్నా ముందు యాక్సిడెంట్ ఆర్ కాన్స్‌పిరసీ గోధ్రా సినిమా ఒక్క రోజు కన్నా ఎక్కువ ఆడలేదు. ఈ సినిమా పేరు ఎవరికి తెలియదని కూడా చెప్పవచ్చు. ఇలాంటిదే స్వతంత్ర్ వీర్ సావర్కర్ సినిమా. స్వయంగా దేవేంద్ర ఫడ్నవిస్ ఈ సినిమాను ప్రమోట్ చేశారు. కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ ప్రత్యేక స్క్రీనింగ్‌కు వచ్చారు. ఈ సినిమా కూడా ఫ్లాప్ సినిమాల జాబితాలోకే వెళ్ళింది.

కశ్మీర్ ఫైల్స్, కేరళస్టోరీ సినిమాలు రెండేళ్ళ క్రితం వందల కోట్లు వసూలు చేశాయి. కాని ఇప్పుడు ఈ ప్రాపగాండ సినిమాలు బాక్సాఫీసు వద్ద చతికిలబడుతున్నాయి. బస్తర్ ద నక్సల్ స్టోరీ, జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ, హమారే బారా, మై అటల్ హూం సినిమాలు నడవలేదు. కంగనా రణావత్ సినిమా ఎమర్జెన్సీ రిలీజ్ కష్టాలెదుర్కుంది. ఇప్పుడు ఈ సినిమా నడుస్తుందా?

దక్షిణాదిలో కూడా ఈ విద్వేషం, ప్రాపగాండ ఫార్ములా ప్రయోగించాలనే ప్రయత్నాలు జరిగాయి. రజాకార్ సినిమాకు నిర్మాత బీజేపీ నాయకుడే. ఎన్నికలకు ముందు రిలీజ్ చేశారు. సినిమా ఫ్లాప్. క్లుప్తంగా చెప్పేదేమిటంటే, రెండేళ్ళ క్రితం తుఫానులా కనకవర్షం కురిపించిన ప్రాపగాండ సినిమాలు 2024లో చతికిలబడ్డాయి. లేకపోతే బహుశా ఈ సంవత్సరం ఆక్సిజన్ ఫైల్స్ పేరుతో డా. కఫీల్ ఖాన్‌ను విలన్‌గా చూపించే సినిమా వచ్చేదేమో! 2024లో ఇలాంటి సినిమాల్లో సక్సెస్ అయిన సినిమా ఆర్టికల్ 370 ఒక్కటే. ఇందులో ప్రాపగాండ ఉన్నప్పటికీ ఒక స్థాయిని మించలేదు. బహుశా 2025లో ఇలాంటి సినిమాలు మరికొన్ని రావచ్చు. ఏది ఏమైనా ప్రాపగాండ, విద్వేష ప్రచారాలను ప్రజలు కూడా అర్థం చేసుకుంటున్నారని భావించవచ్చా? వేచి చూద్దాం.

అబ్దుల్ వాహెద్



# మండుతున్న మధ్య ప్రాచ్యం

**ఇస్రాయీల్ మంత్రి** హైమ్ రామో ప్రకటన ఒకటి వచ్చింది. గజాలో ఇస్రాయీల్ దారుణంగా విఫలమైందని ఆయన అన్నాడు. గత 14 నెలలుగా గజాలో విధ్వంసం సృష్టించిన ఇస్రాయీల్ ఇప్పటి వరకు సాధించిన లక్ష్యాలేవీ లేవు. హమాస్ ను నిర్మూలించడం సాధ్యపడలేదు. ఇస్మాయీల్ హానియాను చంపితే మాత్రాన హమాస్ అంతమైపోతుందనుకున్న కలలు కల్లలే అయ్యాయి. అంతేకాదు, గజాలో ఇప్పటికీ హమాస్ అధికారమే చెల్లుతోంది. మరోవైపు ఇస్రాయీల్ సృష్టించిన విధ్వంసం పలస్తీనా ప్రతిఘటనా పోరాటానికి మరింత బలాన్నిచ్చింది. కొత్తగా అనేకమంది హమాస్‌లో చేరినట్లు తెలుస్తోంది. హమాస్ శక్తిసామర్థ్యాలు తగ్గలేదు సరికదా పెరిగినట్లు అనిపిస్తోంది. వరుసగా వారం రోజులకు పైబడి హమాస్ ఇస్రాయీల్‌పై క్షిపణి దాడులు చేసింది. ఇస్రాయీల్ గొప్పగా చెప్పుకున్న ఐరన్ డోమ్ గురించి ఇప్పుడు ఎవ్వరు మాట్లాడడం లేదు. ఎందుకంటే, హమాస్ ప్రయోగిస్తున్న క్షిపణులు లక్ష్యాలను తాకుతున్నాయి. ఇస్రాయీల్ గొప్పగా చెప్పుకునే మర్కావా యుద్ధట్యాంకులను హమాస్ పోరాటయోధులు వరుసగా ధ్వంసం చేయడం కొనసాగుతోంది. ఈ వార్తలకు అర్థమొక్కటే, సైనికంగా అత్యంత బలమైన దేశంగా చెప్పుకునే ఇస్రాయీల్ చేసింది గజాలో అమాయక పౌరులను చంపడం మాత్రమే. పోరాట యోధుల్ని తాకలేకపోయింది. గజా విధ్వంస దృశ్యాలు యావత్తు ప్రపంచం చూసింది. ఇది యుద్ధమా? దీన్ని జాతి నిర్మూలనగా

చాలా మంది స్పష్టంగా ప్రకటించారు. ఇంత విధ్వంసంలోను హమాస్ ప్రతిఘటన కొనసాగుతూనే ఉందన్నది గమనించాలి. ఇంత విధ్వంసం, హత్యాకాండ కొనసాగించిన తర్వాత కూడా ప్రతిఘటన కొనసాగుతుందంటే, హమాస్ బలం తగ్గలేదంటే అర్థమేమిటి? అర్థం ఒక్కటే పలస్తీనా పోరాటం నేడు పుట్టింది కాదు. అక్టోబర్ 7, 2023వ తేదీన హమాస్ చేసిన దాడి వల్లనే ఈ యుద్ధం ప్రారంభమైందని చాలా మంది ప్రచారం చేయడంలో కుటిల నీతి ఉంది. కాని ఈ పోరాటం గత 70 సంవత్సరాలుగా కొనసాగుతోంది. 1946 తర్వాతి నుంచి పలస్తీనా భూభాగాలను అమెరికా వత్తాసుతో ఇస్రాయీల్ కబళిస్తూ వస్తోంది. పలస్తీనాపై అణిచివేతలు, దౌర్జన్యాలు, వివక్ష, హింస కొనసాగుతూ వస్తోంది. పలస్తీనా ప్రజల ఆగ్రహావేశాలు, ఆవేదనా ఆక్రోశాలు తరతరాలుగా కొనసాగు తూనే వస్తున్నాయి. ప్రపంచ దేశాలు ఈ విషయంలో చేసింది ఏదీ లేదు. ఇస్రాయీల్‌తో స్నేహగీతాలు పాడడంలోనే మునిగిపోయాయి. చివరకు ఇప్పుడేం జరుగుతోంది. ఇస్రాయీల్ తన సైనికశక్తితో ఇళ్ళు, పట్టణాలు ధ్వంసం చేయవచ్చు. సామూహిక హత్యా కాండలు కొనసాగించవచ్చు, కాని ప్రజల్లోని స్వేచ్ఛాపిపాసను అణిచి వేయడం సాధ్యం కాదు.

కాని దురదృష్టమేమిటంటే, వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనా అథారిటీ మాత్రం హమాస్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్న వార్తలు వస్తున్నాయి. బహుశా ట్రంప్ వచ్చిన తర్వాత పాలస్తీనా అథారిటీ తీసుకుంటున్న ఈ చర్యలకు మెచ్చుకుని బహుమతులు ఇస్తాడని ఆశిస్తున్నారో ఏమో తెలియదు.

ట్రంప్ రావాలని కోరుకుంటున్న వారిలో ఇస్రాయీల్ ముందు వరుసలో ఉంది. ట్రంప్ వస్తే గజాపై మరింత అణిచివేత అమలు చేయవచ్చని ఆశిస్తోంది. ట్రంప్ గెలిచిన తర్వాత ఇస్రాయీల్‌కు మరింత అనుకూలంగా వ్యవహరిస్తాడనే అందరూ అనుకుంటు న్నారు. ఇప్పుడు గజాకు అందుతున్న మానవీయ సహాయాన్ని పూర్తిగా అడ్డుకునే ప్రణాళికలు కూడా సిద్ధమవు తున్నాయని వార్త. గజాలో యుద్ధ బాధితులకు సహాయమందించే ఐక్యరాజ్య సమితి సంస్థ కూడా తన కార్యకలాపాలు నిలిపేసే పరిస్థితులు తలెత్తుతున్నాయి. కాల్పుల విరమణ జరిగే అవకాశాలు కూడా కనబడడం లేదు. పూర్తి యుద్ధ విరమణకు మాత్రమే అంగీకరిస్తా మని హమాస్ అంటుంటే, కాల్పుల విరమణ కొంతకాలం మాత్రమేనని ఇస్రాయీల్ అంటోంది. అంటే, హమాస్ చేతుల్లో బందీలుగా ఉన్న ఇస్రాయీల్ పౌరులను విడిపించుకునే వరకు మాత్రమే. ఆ తర్వాత మళ్ళీ యుద్ధం కొనసాగించి హమాస్‌ని అంతం చేయాలని భావిస్తోంది. కాని 14 నెలల కాలం ఏమీ చేయలేని బలమైన సైన్యం. ఆ తర్వాత మాత్రం ఏదో చేసే స్తుందని అనుకోవడమే విచిత్రం. ఇప్పటి వరకు బైడెన్ ప్రభుత్వం 22 బిలియన్ల ఆయుధాలు ఇస్రాయీల్‌కు ఇచ్చింది. ఇప్పుడు అధికారం నుంచి తప్పుకునే ముందు మరో 8 బిలియన్ల ఆయు ధాలు పంపుతోంది.

మరోవైపు సిరియాలో అమెరికా కుట్రలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇస్రాయీల్ ఇటీవల అలెప్పోపై బాంబులు కురిపించింది. దాదాపు డెమాస్కస్ వరకు ఇస్రాయీల్ చేరు కుంది. అంటే అక్కడి నీటివనరులపై ఇస్రాయీల్ అదుపు సంపా దించుకోవచ్చు. ఎంత బీభత్సమైన బాంబుదాడులు జరిగాయంటే 2.5 రిక్టర్ స్కేలు కొలతలతో భూకంపం నమోదయ్యాయి. కాని, ఇప్పుడు సిరియాలో కొత్తగా వచ్చిన ప్రభుత్వం, అమెరికా మద్దతుతో నిలబడిన ప్రభుత్వం, సౌదీ అరేబియా కూడా సహాయం చేయ డానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వం లెబనాన్‌పై పోరాడుతోంది, కాని ఇస్రాయీల్ పై పోరాడ్డం లేదు. ఇస్రాయీల్ పై అమెరికాతో ఫిర్యాదులు చేసుకుంటూ కాలం వెళ్ళబుచ్చు తోంది. మరోవైపు ఇస్రాయీల్ సిరియాలో భూభాగాలు ఆక్రమించుకుంటోంది. సిరియా ప్రతిఘటనాదళాలుగా చెప్పుకుని ప్రభుత్వాన్ని పడగొట్టి అధికారంలోకి వచ్చినవాళ్ళు ఇస్రాయీల్ కు వ్యతిరేకంగా చర్యలు తీసుకోడానికి సిద్ధంగా లేరు. మరోవైపు ఉత్తర సిరియాలో అమెరికా కొత్త సైనికస్థావరం తయారు చేసుకుంటోంది. అక్కడ కుర్దులకు, టర్కీ మద్దతుదారులకు మధ్య యుద్ధం జరుగుతోంది. ఉత్తర సిరియా ఇప్పుడు సిరియాలో అంతర్భాగంగా మ్యాపులో కనిపిస్తున్నప్పటికీ సిరియా ప్రస్తుత ప్రభుత్వం అక్కడ అడుగుపెట్టే పరిస్థితి లేదు. అక్కడ అమెరికా, టర్కీల మధ్య ఘర్షణ కొన సాగుతోంది. దక్షిణ సిరియాలో మౌంట్ హర్మన్ వరకు ఇస్రా యీల్ ఆక్రమణ జరిగిపోయిందనే చెప్పాలి. సిరియా ప్రతిఘటన దళాలుగా చెప్పుకునే ఈ తిరుగుబాటు సేనలకు మిగిలిందేమిటి? దక్షిణ సిరియా ఇస్రాయీల్ చేతుల్లోకి పోతోంది. ఉత్తర సిరియాలో టర్కీ, అమెరికాలు తిష్టవేశాయి. ఐసిస్ నుంచి వచ్చిన ఈ దళాలకు గతంలో లెబనాన్‌లోని హిజ్బుల్లా తగిన గుణపాఠం విస్మరించ రానిది. ఐసిస్ పీచమణిచింది హిజ్బుల్లా మాత్రమే అన్నది విస్మరించరానిది. ఇప్పుడు అమెరికా, పాశ్చాత్య దేశాలకు సిరియాలో పాగా వేసే అవకాశం దొరికింది. రష్యాకు

వ్యతిరేకంగా తమకు అను కూలంగా సిరియా దొరికింది. రష్యా సైనిక స్థావరం ఇప్పటికి కూడా సిరియాలో ఉంది. రష్యా సైనికస్థావరం జోలికి వెళ్లమని సిరియా కొత్త ప్రభుత్వం ప్రకటించింది. కాని, అక్కడ రష్యా పరిస్థితి బలహీనపడిందన్నది వాస్తవం. సౌదీ అరేబియా కూడా సిరియాకు సహాయం చేస్తానని ముందుకు వచ్చింది. సిరియాలో ప్రభుత్వం కూలిపోయిన తర్వాత సౌదీ నుంచి పలస్తీనాకు సంబం ధించి ఎలాంటి ప్రకటనలు కూడా రావడం లేదన్నది కూడా గమనార్హం. డాక్టర్ అబు సఫయా గురించి వార్తలు ఇప్పుడు స్పష్టమయ్యాయి. ఒక ఆసుపత్రిని నాశనం చేసి, ఆ ఆసుపత్రి డైరెక్టర్‌ను నిర్బంధించిన ఇస్రాయీల్‌కు వ్యతిరేకంగా అరబ్బు దేశాల్లో ఏ దేశం కూడా పల్లెత్తు మాట అనలేదు. రెండు సైన్యాల మధ్య యుద్ధం జరుగుతున్నప్పుడు, ఒక ఆసుపత్రిని ధ్వంసం చేయడమేమిటి? డాక్టరును నిర్బంధిం చడం ఏమిటి? అని అడిగేవాడే లేడు. ఇస్రాయీల్ ఎన్ని ఆసుపత్రులను ధ్వంసం చేసిందో, ఎంత మంది డాక్టర్లను హతమార్చడం లేదా నిర్బంధిం చడం చేసిందో లెక్కలు తేల్చేది ఎవరు? మానవహక్కుల గురించి ప్రసంగాలు చేసే పాశ్చాత్య ప్రపంచం కూడా నోరిప్పడం లేదు. అయితే పోప్ నిర్ద్వంద్వంగా ఇస్రాయీల్ చేస్తున్నది జాతి నిర్మూలన అని ప్రకటించారు. ఐర్లాండ్ నుంచి కాథలిక్ చర్చి అధినేత కూడా ఇస్రాయీల్ చేస్తున్నది దుర్మార్గమని ప్రకటించారు.

మరోవైపు ఎమన్‌లో హూతీలపై కూడా అమెరికా దాడులు చేస్తోంది. హూతీలు కూడా ఇస్రాయీల్ పై దాడులు కొనసాగిస్తు న్నారు. ఇటీవల హూతీలు ప్రయోగించిన రెండు క్షిపణుల్లో ఒకదాన్ని మాత్రమే ఇస్రాయీల్ అడ్డుకోగలిగింది. రెండో క్షిపణి వల్ల భారీ నష్టం జరిగినట్లు వార్త.

ప్రస్తుతం అత్యంత దీనావస్థలో ఉన్నది గజా కాదు, సిరియా. ఇప్పుడు ఈ దేశం ముక్కలు చెక్కలైనా ఆశ్చర్యం లేదు. సిరియాలో ఉత్తరభాగాన్ని ఆక్రమించుకోవాలని టర్కీ ప్రయత్నిస్తోంది. ఈరాన్ ఇప్పుడు మౌనంగా ఉన్నప్పటికీ సిరియాలో ఈరాన్ ప్రాబల్యం కూడా ఉంది. అమెరికా అక్కడి భూభాగాలను తన గుప్పిట బిగించి చమురు దోచుకోవాలని చూస్తోంది. ఇస్రాయీల్ అక్కడి నుంచి నీళ్ళు దోచుకోవాలని చూస్తోంది.

అత్యంత బీభత్సమైన యుద్ధవిధ్వంసం జరుగుతున్నది గజాలోనే. అక్కడ దాడులు పరంపర కొనసాగుతూనే ఉంది. ఈ దాడులు హమాస్ పై జరగడంలేదు. సాధారణ ప్రజలపై జరుగుతున్నాయి. హమాస్ ప్రతిదాడులు చేస్తోంది.

ఈ నేపథ్యంలో ఇస్రాయీల్‌లోని నాగెల్ కమిటీ చేసిన ఒక హెచ్చరిక వచ్చింది. ఇస్రాయీల్ భద్రతా వ్యవహారాలపై ఏర్పాటు చేసిన కమిటీ ఇది. టర్కీతో యుద్ధానికి ఇస్రాయీల్ సిద్ధంగా ఉండాలని ఈ కమిటీ సూచించింది. మరో వైపు టర్కీ అధ్యక్షుడు ఏర్దుగాన్ ప్రకటన కూడా వచ్చింది. గజా ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం నిలబడతానని అన్నాడాయన. సిరియాను విముక్తం చేసినట్లే పలస్తీనాను కూడా విముక్తం చేస్తామని అన్నాడు. సిరియా విముక్తమైన తర్వాత పరిస్థితేమిటో చూశాం. సిరియాలో ఎర్దుగాన్ వైఖరి వల్ల తలెత్తిన పరిస్థితులు ఇప్పుడు స్వయంగా ఎర్దుగాన్‌కు తలనొప్పిగా మారాయి. సిరియాలో బషారుల్ అసద్ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత గజాపై ఇప్పటి వరకు ఒక్క మాట చెప్పని ఎర్దుగాన్ ఇప్పుడు మళ్ళీ గజా గురించి మాట్లాడుతున్నారు. ఇస్రాయీల్ లోని నాగెల్ కమిటీ ప్రకటన వచ్చిన వెంటనే ఉర్దుగాన్ కు గజా గుర్తొచ్చింది. సౌదీ, టర్కీ దేశాలు పలస్తీనా కోసం నోటిమాటలు తప్ప ఇంతవరకు చేసింది ఏదీ లేదు. సిరియాలో బషారుల్ అసద్ ప్రభుత్వం కూలిన తర్వాత టర్కీ ప్రాబల్యం పెరుగుతుందని ఉర్దుగాన్ భావించారు. టర్కీ ముక్కలు కాకుండా కాపాడతామని కూడా ఆయన చెప్పారు. సిరియాను ఒక్కటిగా ఉంచిన బషారుల్ అసద్ ప్రభుత్వాన్ని కూల్చడానికి పూర్తి ప్రయత్నాలు చేసిన టర్కీ ఇప్పుడు సిరియా ముక్కలు కాకుండా కాపాడుతానని చెబుతోంది. ఇస్రాయీల్ కు వ్యతిరేకంగా టర్కీ చెప్పే మాటలు, టర్కీ చర్యల వల్ల సిరియాలో ఇస్రాయీల్‌కు లభించిన అవకాశాలు ఈ రెండింటిని చూస్తే మధ్యప్రాచ్యంలో ఎలాంటి రాజకీయాలు నడుస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఉత్తర సిరియాలో కుర్దులను అణిచేయాలని టర్కీ దాడులు చేస్తోంది. కుర్దులకు అమెరికా సహాయమందిస్తోంది. నిజానికి టర్కీ నాటో సభ్యదేశం. కాని సిరియాలో టర్కీ వైఖరి అమెరికాకు వ్యతిరేకం.

పశ్చిమాసియాలో అత్యంత బలమైన దేశాలు టర్కీ, ఈరాన్. ఈ రెండు దేశాలను అదుపు చేస్తే ఇక అమెరికా, ఇస్రాయీల్ దేశాలకు మధ్యప్రాచ్యంలో తిరుగు ఉండదు. ట్రంప్ వచ్చిన వెంటనే ఈరాన్‌పై దాడి చేస్తే బాగుండునని ఇస్రాయీల్ చూస్తోంది. మరోవైపు ఈరాన్ ఆయుధబలం పెంచుకుంటోంది. ఈసారి తమపై దాడి జరిగితే ప్రపంచయుద్ధానికి దారి తీస్తుందని ఈరాన్ విదేశాంగ మంత్రి చైనా పర్యటనలో హెచ్చరించాడు.

గజాకు మద్దతుగా టర్కీ అధ్యక్షుడి మాటలను ఎవరైనా పట్టించు కున్నారా అంటే అనుమానమే. కాని హమాస్ దాడులతో ఇస్రాయిల్ ఉక్కిరిబిక్కిరి అవుతుందన్నది వాస్తవం. చివరకు కాల్పుల విరమణకు ఇస్రాయిల్ దిగివస్తుందనే వార్తలు వస్తు న్నాయి. టర్కీ అధ్యక్షుడు ఉర్దుగాన్ వైఖరి ఎలా ఉన్నప్పటికీ ఆయన చెప్పిన ఒక మాట మాత్రం వాస్తవం. మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపన అనేది 1967 నాటి రెండు స్వతంత్రదేశాల ఏర్పాటుతోనే సాధ్యమనేది నిజం. అమెరికా, ఇస్రాయిల్ దేశాలు దీనికి ఒప్పుకోవడం లేదు.

అసలు ఈ యుద్ధం అంతా ఎందుకు జరుగుతుందన్నది ఎవరూ లోతుగా చూసింది లేదు. అమెరికా బిలియన్ల కొద్ది సహాయం ఇస్రాయిల్‌కు ఎందుకు చేస్తుందన్నది కూడా చాలా మంది ఆలోచించడం లేదు. పలస్తీనా భూభాగంలో చమురు సహజ వాయు నిక్షేపాల విలువ 450 బిలియన్ డాలర్లు. ఈ సంపద కోసం అమెరికా ఇస్రాయిల్ దేశాలు ఏమైనా చేయగలవు. సిరియాలో చమురు దోపిడి మొదలైపోయింది. ఇరాక్ లో జరిగింది, జరుగుతున్నది కూడా ఇదే. గజాలో కూడా ఈ దోపిడి కోసమే అమెరికా ఇస్రాయిల్ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. కాని హమాస్ కొరకరాని కొయ్యగా మారింది.

ట్రంప్ కూడా గజా యుద్ధం త్వరగా ముగియాలని కోరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అందువల్లనే కాల్పుల విరమణ అవకాశాలు పెరిగాయని అంటున్నారు. పైగా ఇస్రాయిల్ కు కూడా నష్టాలు చవిచూడవలసి వస్తోంది. అయితే కాల్పుల విరమణ జరిగిన తర్వాత ఇస్రాయిల్‌లో నెతన్యాహు ప్రభుత్వం కూలిపోయే అవకాశాలున్నాయి. కాబట్టి కాల్పుల విరమణ జరుగుతుందా అన్నది అనుమానమే.

లెబనాన్‌లో కూడా ఇస్రాయిల్ కాల్పుల విరమణకు ససేమిరా అంటూ వచ్చింది. తర్వాత కాల్పుల విరమణకు ఒప్పుకోవడమే కాదు, లెబనాన్ నుంచి తన సైన్యాన్ని వెనక్కు తీసుకుంటోంది. ఇస్రాయిల్ సైన్యం 60 రోజుల్లోగా వెనక్కు వెళ్ళకపోతే కాల్పుల విరమణ ఉండదని హిజ్బుల్లా స్పష్టం చేసింద న్నది గమనార్హం. హిజ్బుల్లాతో తలపడిన ఇస్రాయిల్ భారీ నష్టాన్ని భరించవలసి వచ్చింది. మరోవైపు హూతీల దాడులు కూడా కొనసాగు తున్నాయి. ఇస్రాయిల్ ఐరన్ డోమ్ మాత్రమే కాదు, అమెరికా నుంచి తెచ్చుకున్న థాడ్ రక్షణ వ్యవస్థ కూడా ఉపయోగపడడం లేదు. ఇవన్నీ ఆగాలంటే గజాలో కాల్పుల విరమణకు సిద్ధపడి హమాస్‌తో ఒప్పందం చేసుకోవడం ఒక్కటే దారి. ఇస్రాయిల్ ఈ పని చేస్తుందా? లేక ఈరాన్‌పై మళ్ళీ దాడి చేసి ఈ యుద్ధసంక్షోభాన్ని మరింత పెంచి నెతన్యాహు తన గద్దె కాపాడు కుంటారా? కాని ఈరాన్‌పై దాడి అంత సులభం కాదు. ఇలాంటి దాడులకు తాము సిద్ధంగా ఉన్నామని ఈరాన్ మంత్రులు చేసిన ప్రకటనలు స్పష్టంగా ముందుకు వచ్చాయి. రష్యా, చైనాలు ఈరాన్ కు మద్దతుగా ఉన్నాయన్నది కూడా స్పష్టం. లెబనాన్‌లో కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరగవలసి ఉంది. కొత్త అధ్యక్షుడు హిజ్బుల్లా విషయంలో ఎలాంటి వైఖరి అవలంబిస్తాడన్నది కూడా ఇప్పుడే చెప్పలేము. ఇస్రాయిల్ ప్రధాని నెతన్యాహు తన గద్దె కోసం ఈరాన్‌పై దాడి చేసే దుస్సాహసానికి పూనుకుంటాడా? లేక టర్కీపై కాలుదువ్వుతాడు? లేక ఈజిప్టుపై దాడి చేస్తాడా? అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.


మధ్యప్రాచ్యంలో ఇది పరిస్థితి. శాంతి మంత్రం జపిస్తున్న ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత యుద్ధం మరింత ప్రజ్వలిస్తుందా? లేక శాంతి సాధ్యమవుతుందా? ఇస్రాయిల్ దుస్సాహసానికి పూనుకుంటే యుద్ధం మరింత తీవ్రమవుతుంది. బైడెన్ కన్నా ఎక్కువగా ట్రంప్ చేయగలిగింది కూడా ఏమీ ఉండదు. ట్రంప్ హెచ్చరికల వల్ల జరిగేది కూడా ఏమీ ఉండదు. ✤

గీటురాయి
సహజీవన భావనల పావురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థా లను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

# అత్యంత ప్రభావశీలురైన భారతీయ ముస్లింల జాబితాలో
# చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్




**ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు న్యూఢిల్లీ నుండి వెలువడుతున్న "ముస్లిం మిర్రర్" ప్రకటించిన అత్యంత ప్రభావశీలురైన వంద మంది భారతీయ ముస్లింల జాబితాలో స్థానం లభించింది. ఈ విషయాన్ని "ముస్లిం మిర్రర్" ప్రధాన సంపాదకులు జుబైర్ వెల్లడించారు. ఈ మేరకు నశీర్ అహమ్మద్‌కు ఆయన అంతర్జాలం ద్వారా సమాచారం అందజేశారు.**

భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు నిర్వహించిన మహత్తర త్యాగమయ పాత్రను వివరిస్తూ గత 25 ఏండ్లుగా నశీర్ అహమ్మద్ పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రాస్తూ, ఆ సమాచారాన్ని ప్రజల ఎరుకలోకి తీసుకురావడానికి పలు విభిన్న ప్రచార పద్ధతుల ద్వారా నిరంతరం కృషి చేస్తున్నందున, ఆయన కృషికి గుర్తింపుగా 2024 నాటి ఈ జాబితాలో నశీర్‌కు స్థానం కల్పించినట్లు జబైర్ ప్రకటించారు. భారత దేశంలో మరెవ్వరూ చేయని విధంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్ర మీద నశీర్ ఇప్పటి వరకు 25 గ్రంథాలు రచించి వెలువరించారని, ఈ గ్రంథాలు దేశంలోని పలు భాషల్లోకి అనువాదం చేయబడి ప్రచురితం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. గ్రంథ రచన ప్రచురణ చేయడం మాత్రమే కాకుండా దాతల, ప్రజా సంఘాల సహకారంతో నశీర్ వేలాది పుస్తకాలను ప్రచురించి ప్రజలకు, ఎంపిక చేసిన గ్రంథాలయాలకు కానుకలుగా అందించడం నశీర్ కృషిలోని విశేషాంశమని జుబైల్ తెలిపారు. చరిత్ర రచన ప్రచురణ కార్యక్రమాలు మాత్రమే కాకుండా నశీర్ ప్రజాజీవనంలోని వివిధ రంగాలలో క్రియాశీలక పాత్ర నిర్వహిస్తూ గత ఐదు దశాబ్దాలుగా అందిస్తున్న ఉదాత్త సేవలను కూడా పరిగణనలోకి తీసుకుని ఆయనను 2024 నాటి భారతీయ ముస్లింలలోని వంద మంది ప్రభావశీలుర జాబితాలోకి ఎంపిక చేసినట్టు జుబైర్ వివరించారు. ఈ వంద మంది వివరాలతో కూడిన బృహద్గ్రంథాన్ని త్వరలో ప్రచురించనున్నామని జుబైర్ వెల్లడించారు.

ఈ సందర్భంగా సయ్యద్ నశీర్ అహమ్మద్ తనను కలసిన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ, హమీద్ అన్సారి, అసదుద్దీన్ ఓవైసీ, ముహమ్మద్ మదని, అజం ఖాన్, ఏ ఆర్ రెహమాన్, అమీర్ ఖాన్, సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్, బుర్హనుద్దీన్ అజ్మల్, అబ్దుల్ ఖదీర్, ఇమ్రాన్ ప్రతాప్గరి, ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, అజీమ్ హాష్మీ ప్రేమ్ జీ, రాణా అయూబ్, మెహబూబా ముఫ్తీ లాంటి విభిన్న రంగాలలో ప్రముఖులైన వంద మంది భారతీయ ముస్లిం ప్రముఖుల సరసన తనకు చోటు లభించటం ఆనందంగా ఉందన్నారు. ✤



# పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావం...!

డా. మహ్మద్ హసన్, అసిస్టెంట్ ప్రొఫెసర్

**"పిల్లలూ దేవుడూ చల్లనివారే కల్లకపట మెరుగని కరుణామయులే, తప్పులు మన్నించుటే దేవుని సుగుణం...."** అని ఒక పాట రాశారు ఆరుద్ర. పిల్లలు దైవానికి ప్రతిరూపాలు, దివ్యత్వానికి ప్రతి నిధులు, కల్మషం, కర్కషం, కపటం, అసూయ, ద్వేషాలు ఎరుగని అమలినమైన ప్రవర్తన వారి సొంతం. అలాంటి పిల్లలకు తల్లిదండ్రులుగా, కుటుంబం నుండి ఎలాంటి మార్గదర్శకత్వం, సమాజపరంగా లేదా పాఠశాల పరంగా ఎటువంటి వాతావరణం పిల్లలకు మనం అందిస్తున్నామనే దానిపైనే వారి ప్రవర్తన ఆధార పడి ఉంటుంది. పిల్లలకు న్యూటన్ "చర్యా ప్రతిచర్య" సిద్ధాంతంలాగా చర్యలపరంగా ఎలాంటి శిక్షణ అందిస్తామో ప్రతి చర్యగా అలాంటి ఉత్తమమైన ప్రవర్తనను వారి నుండి మనం ఆశించవచ్చు.

ఇటివల సంధ్య థియేటర్ వద్ద పుష్ప-2 సినిమా బెనిఫిట్ షోలో జరిగిన తొక్కిసలాటలో (03-12-2024 బుధవారం) రేవతి అనే (35) మహిళతో పాటు ఆమె కుమారుడు శ్రీ తేజ (9) కింద పడిపోయి జనం కాళ్ళ మధ్య నలిగి పోయాడు. ఈ ఘటనలో తల్లి వెంటనే చనిపోగా కుమారుడు శ్రీ తేజ ప్రస్తుతం హాస్పిటల్ లో చావు బ్రతుకుల మధ్య పోరాడుతున్నాడు. ఈ దుర్ఘటన జరిగి మూడు వారాలు గడిచినప్పటికి నేటికి బాబు ఆరోగ్యం ఇంకా మెరుగుపడక పోవడం ఆందోళన కల్గించే అంశమే. ఈ సంఘటనకు కారకులెవరు? ఎవర్ని తప్పు పట్టాలి? ఆ సినిమాలో హీరోగా నటించిన అల్లు అర్జున్ షో చూడటానికి రావటమా? లేదా థియేటర్ యాజమాన్యానిదా? లేదా జన సమ్మర్ధం వున్న ప్రాంతంలో అల్లు అర్జున్ రాకతో జరిగిన తొక్కిసలాటను అదుపు

చేయలేని పోలీసులదా? అన్న అనేక ప్రశ్నలు ఘటన జరిగిన తర్వాత రావడం సహజం. కాని ఈ ఘటనకు అభం శుభం తెలియని పసి పిల్లాడు తల్లిదండ్రులను ఎందుకు సినిమా చూడాలని ప్రేరేపించాడు, దానికి తల్లిదండ్రుల తప్పు లేదా?

పిల్లవాడు ఆ కాలనీలో "పుష్ప" లాగా మ్యానరిజంతో తిరుగుతుంటే ఆ కాలనీ వారు గాని ఇంట్లో తల్లిదండ్రులు గాని సున్నితంగా అలాంటి ప్రవర్తనను మందలించి వుంటే నేడు ఈ సంఘటన కారకుడై ఉండకపోవచ్చు. అంతెందుకు ఆ సినిమా చూడడానికి అల్లు అర్జున్ వస్తాడని ఎవరూ ఊహించి ఉండకపోవచ్చు. అతడు థియేటర్‌కు రాకుండా వుండి వుంటే ఈ దుర్ఘటన జరిగి వుండేదే కాదు. అంతెందుకు పోలీసులు అక్కడి రద్దీని నియంత్రించటం కష్టం అని అల్లు అర్జున్ షో చూడటానికి రావద్దని చెప్పినప్పటికి ఆ విషయం థియేటర్ యాజమాన్యం వారు అల్లు అర్జున్‌కి చెప్పకపోవడం వల్ల కూడా ఈ దుర్ఘటన జరిగింది.

పిల్లల్లో అసాధారణమైన, అసహజమైన వ్యక్తి ఆరాధన (Hero Worship) చిన్న వయస్సులోనైనా, టీనేజ్ లోనైనా కలిగే అవకాశం వుంటుంది. దీనిని గమనించిన తల్లిదండ్రులు వెంటనే పిల్లలను మందలించే ప్రయత్నం చేయాలి. దేశ సేవ చేసే నాయకులను హీరోలుగా పరిగణించాలని తల్లిదండ్రులు సూచించాలి, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మీడియా గగ్గోలుపెట్టి భూతద్దంలో పెట్టి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించటం కన్నా ఈ అంశంలో పిల్లలు ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదు అన్న విషయాలపై మానసిక నిపుణుల సలహాలు, సూచనలు ఎక్కువ మొత్తంలో ప్రసారం చేయాలి. విపరీతమైన డ్రెస్ సెన్సు, హేర్ కటింగ్ తల్లిదండ్రులు విలువైన వాహనాలు పిల్లలకు ఇచ్చి బయటకి పంపిస్తే ఏం జరుగుతుందో నిత్యం మనం రోడ్డు ప్రమాదాల్లో యువత ఎంతమంది చనిపోతున్నారో మనం చూస్తూనే ఉన్నాం.

అంతెందుకు ఇటీవలే చైనా కంపెనీ వీవో (VIVO) మన దేశంలో "స్మార్ట్ ఫోన్" వినియోగంపై ఓ సర్వే నిర్వహించగా విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయ్. ఈ సర్వే ప్రకారం "స్మార్ట్ ఫోన్" ఎక్కువగా వాడటం వల్ల తల్లిదండ్రుల పిల్లల సంబంధాలపై ప్రతికుల ప్రభావం పడుతోందని రోజులో సగటున పెద్దలు ఐదు గంటలుపైగా, పిల్లలు నాలుగు గంటలకు పైగా మించి "స్మార్ట్ ఫోన్లు" వాడుతున్నారని తెలిపింది.

ఇందులో ఎక్కువ భాగం సామాజిక మాధ్యమాలలో (Social Media) (Facebook, Whatsapp, Youtube, Instagram, Twitter) వినోద కార్యక్రమాలు వీక్షిస్తున్నట్లు తెలిపింది. దీని ద్వారా యుక్త వయస్సు పిల్లలు, చిన్న పిల్లలు ఇతర దురలవాట్లకు గురయ్యే ప్రమాదం వుందని కూడా సూచించింది. సంబంధాలు దెబ్బతినడానికి "స్మార్ట్ ఫోన్" కూడా

**తమ సంతానం వ్యక్తిత్వాన్ని తల్లిదండ్రులు ఎలా అయితే తీర్చిదిద్దుతారో వారికీ అలాంటి భవిష్యత్ ముందు ముందు దొరుకుతుంది, సంస్కారం, శిక్షణలతోనే మనిషి వ్యక్తిత్వం రూపు దిద్దుకుంటుంది. కాబట్టి అలాంటి ఉత్తమ శిక్షణ పిల్లలకు ఇచ్చి ఉత్తమ విలువలు గల పౌరులుగా తయారు చేయాలన్న బాధ్యత తల్లిదండ్రులదే.**

ప్రధాన కారణం అని 73 శాతం మంది తల్లిదండ్రులు, 69 శాతం మంది పిల్లలు ఈ సర్వేలో అంగీకరించటం విశేషం. అలాగే "స్మార్ట్ ఫోన్" లేకుండా మేం ఉండలేం అని 76 శాతం మంది తల్లిదండ్రులు, 71 శాతం మంది పిల్లలు ఈ సర్వేలో ఒప్పుకొన్నారంటే దేశంలో "సోషల్ మీడియా" వినియోగం వల్ల మానవ సంబంధాల విధ్వంసం రాబోయే రోజుల్లో ఎలా ఉండబోతుందో ఊహించుకోవచ్చు. స్మార్ట్ ఫోన్ వినియోగాన్ని ఇటీవలే ఆస్ట్రేలియా దేశం 16 సం.లోపు పిల్లలకు నిషేధించింది. మన దేశం కూడా ముందు ముందు ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కోకుండా ఉండాలంటే ముందు జాగ్రత్తగానే మేల్కొని పిల్లలకు, పెద్దలకు హాని కల్గించే స్మార్ట్ ఫోన్లను, సోషల్ మీడియాలో వచ్చే అశ్లీలమైన వీడియోలు ఎవైనా ఉంటే నిలిపివేసేవిధంగా కఠిన చర్యలు తీసుకోవాలి. ఒక చిన్న యంత్రం కుటుంబ బంధాల్లో చిచ్చుపెట్టి విడిపోవడానికి కారణం అవుతుందంటే మనం దీనిని ఏ స్థాయిలో "దుర్వినియోగం" చేసున్నామో అర్థం చేసుకోవచ్చు.

"యవ్వనం" (టీనేజ్) మనిషి జీవితంలో ఒక "సునామి" వంటిది. శరీరంలో మానసికంగా బావోద్వేగపరంగా హార్మోన్ల మార్పులు ఒక్కసారిగా మనిషిని చుట్టుముడతాయి. వాటిని అర్థం చేసుకోలేక సమన్వయం చేసుకోలేక యువతీ, యువకులు తీవ్రమైన ఒత్తిడికి లోనై ఇతర ఆకర్షణలకు లోనవుతుంటారు. ఈ సమయంలోనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను, యువతీ, యువకులను గమనించి పాజిటివ్ కౌన్సిలింగ్ ఇవ్వాలి. లేని పక్షంలో అనేక రకాల సంఘర్షణలకు లోనై మాదకద్రవ్యా లకు, చెడువ్యసనాలకు, ఇతర అసాంఘిక కార్యక్రమాల వైపు వెళ్ళి తల్లిదండ్రులను ముద్దాయిలుగా చిత్రించే ప్రమాదం కూడా ఉంటుంది. మనిషి జీవితంలో అత్యంత విలువైనది బాల్యమే. అలాంటి బాల్యాన్ని "రంగుల మయం" చేసుకొని అంతకన్నా విలువైన "యవ్వనాన్ని" ఆ కాలంలో అకాడమిక్ విషయాలపై దృష్టిపెడితే పిల్లలు సుందరమైన భవిష్యత్తును నిర్మించుకోగలరు. అందుకే తమ సంతానం వ్యక్తిత్వాన్ని తల్లిదండ్రులు ఎలా అయితే తీర్చిదిద్దుతారో వారికీ అలాంటి భవిష్యత్ ముందు ముందు దొరుకుతుంది, సంస్కారం, శిక్షణలతోనే మనిషి వ్యక్తిత్వం రూపు దిద్దుకుంటుంది. కాబట్టి అలాంటి ఉత్తమ శిక్షణ పిల్లలకు ఇచ్చి ఉత్తమ విలువలు గల పౌరులుగా తయారు చేయాలన్న బాధ్యత తల్లిదండ్రులదే. ✤

# సుపరిపాలనకు సిసలైన చిరునామా...

హిబా అర్జుమంద్ ఖాన్

నేటికి దాదాపు వేయిన్నర సంవత్సరాలనాడు, ముహమ్మద్ ప్రవక్త(స)నిష్క్రమణ అనంతరం ఖలీఫాల పాలన కొనసాగింది. 'ఖలీఫా'అంటే నేటి మన పరిభాషలో ప్రతినిధి, పాలకుడుఅని అర్థం. ఇస్లామీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో నాల్గవ ఖలీఫాగా హజ్రత్ అలీ(ర) పాలన సాగించారు.

ఈయన మక్కాలో జన్మించారు. ఫాతిమా బిన్తెఅసద్, అబూతాలిబ్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ తల్లిదండ్రులు. ఈయనకు తండ్రి పెట్టిన అసలు పేరు 'జైద్'. తల్లి 'హైదర్' అని పెట్టుకున్నారు. అయితే ముహమ్మద్ ప్రవక్త(స) మాత్రం 'అలీ' అని పెట్టారు. దీంతో అసలు పేర్లన్నీ మరుగునపడిపోయి 'అలీ' ఒక్కటే స్థిరపడిపోయింది. పదమూడేళ్ళ పిన్నవయసులోనే ఈయన ఇస్లామ్ ధర్మాన్నిస్వీకరించారు.

హజ్రత్ అలీ ముర్తుజా (ర) చాలా నిరాడంబర పాలకుడు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన నాయకుడు. ముహమ్మద్ ప్రవక్త (స) వారి శిక్షణ, సహచర్యంలో పెరిగినవారు. అధికారం అంటే, స్వలాభం, స్వప్రయోజనంకోసం కాక,ప్రజల ప్రయోజనం కోసం, వారి సంక్షేమం కోసం వినియోగించే సాధన మని నమ్మిన ప్రజా పాలకుడు. తన పాలనలో ఏ ఒక్కరికి అణువంత అన్యాయం జరిగినా ప్రజలకు సంజాయిషీ ఇచ్చు కోవడంతో పాటు, దైవానికీ సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుం దని భావించిన ప్రభువు.

హజ్రత్ అలీ (ర) ఖలీఫా అయినప్పటికీ, అధికారం చేతిలో ఉన్నప్పటికీ అతి నిరాడంబరమైన జీవితం గడిపారు. అధికారాన్ని బాధ్యతగా భావించి ప్రజాసంక్షేమం కోసం వినియోగించారు. కుటుంబ పోషణ నిమిత్తం వ్యవసాయ పనులు చేసేవారు. ప్రభుత్వ ఖజానా నుండి ఒక్క రూపాయి కూడా తీసుకునేవారు కాదు.

ఆయన నిరాడంబరతకు అద్దంపట్టే ఒక సంఘటనచూద్దాం.

ఖలీఫా హజ్రత్ అలీ (ర) ఒకసారి రాత్రంతా కష్టపడి కొంత ధాన్యం సంపాదించారు. సతీమణి హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) వాటిని పిండిపట్టి రొట్టెలు కాల్చి వడ్డించారు. భోజనానికి కూర్చోగానే, ఒక నిరుపేద గుమ్మం ముందుకొచ్చి, 'అమ్మా.. ఆకలితో ఉన్నాను. కాస్త తినడానికేమైనా పెట్టండమ్మా..' అని యాచించాడు. వెంటనే హజ్రత్ అలీ దంపతులు తాము తిందామని వడ్డించుకున్న ఆహారాన్ని యాచకునికి దానం చేశారు. తరువాత మిగిలిన పిండిలో మరికొంత కలిపి మళ్ళీ రొట్టెలు

తయారు చేశారు. వడ్డించి, తిందామని కూర్చొనే సరికి ఒక అనాథ వచ్చి యాచించాడు. మళ్ళీ ఆ ఆహారాన్ని అతనికి ఇచ్చివేశారు. మూడవ సారి మిగిలిన కాస్తంత పిండితో జావకాశారు. ఈసారి ఒక ఖైదీవచ్చి తినడానికి ఏమైనా పెట్టమని అభ్యర్థించాడు. ఈసారి కూడా నోటి దగ్గరి ఆహారాన్ని ఆనిరుపేద ఖైదీకి దానం చేశారు హ(జ్రత్ అలీ (ర) దంపతులు.

ఇక తినడానికి ఆ ఇంట్లో ఏమీ మిగల్లేదు పచ్చి మంచి నీళ్ళు తప్ప. అందరూ ఆ రోజు మంచి నీళ్ళతోనే కడుపు నింపుకొని పస్తులు పడుకున్నారు.

ఒకసారి ప్రభుత్వ ధనాగారానికి కొన్ని పండ్లువచ్చాయి. అందులోంచి ఒక పండును తన కొడుకు చిన్నారి హుసైన్ తీసుకున్నారు. కాని, అవి ప్రభుత్వ ఖజానాకు వచ్చాయి కాబట్టి అవి ప్రజలకే చెందాలి. అందులోంచి ఒక్కపండుకూడా పాలకుడు తన సొంతానికి తీసుకోలేడు. ప్రజల సొమ్ము– అది ఎంత చిన్నదైనా సరే– వాడుకొనే అధికారం పాలకుడికి లేదని చెప్పి, కొడుకు చేతిలోని ఆ పండును ప్రభుత్వ ఖజానాలో వేసి ప్రజలకు పంచి పెట్టారు.

ఒక సందర్భంలో ఆయన ప్రభుత్వ కోశాగారంలోని సంపద నంతా ప్రజలకు పంచిపెట్టేసి దైవానికి కృతజ్ఞతగా రెండు రకతులు నమాజ్ చేశారు. ఆయన కటిక నేలపైనే పడుకునేవారు. ఒకసారి నేలపై పడుకొని ఉన్న హ(జ్రత్ అలీ (ర)ని చూసి దైవప్రవక్త ముహమ్మద్ (స) 'మట్టి మనిషీ' అని సంబోధించారు. అందుకే ఆయన్ని 'అబూ తురాబ్' అని కూడా అంటారు. అంటే మట్టి మనిషి అని అర్థం.

ఈ విధంగా హ(జ్రత్ అలీ (ర) అధికారాన్ని ఒక అమానతుగా, బృహత్తర బాధ్యతగా స్వీకరించారు. పాలకుడంటే కేవలం ప్రజా సంక్షేమం కోసం పని చేసే సేవకుడు మాత్రమేనని ఆచరణాత్మకంగా నిరూపించారు. పరిపాలన అంటే ప్రజలకు మాత్రమే కాకుండా, దైవానికి కూడా జవాబుదారీ అని ప్రగాఢంగా విశ్వ సించిన ఈ ప్రజాపాలకుడు నాలుగు సంవత్సరాల, ఎనిమిది నెలల, ఇరవై నాలుగు రోజులు సువర్ణాక్షరాలతో లిఖించదగిన సుపరిపాలన అందించి, అరవై మూడేళ్ళ వయసులో ఇహలోకం వీడి వెళ్ళిపోయారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, ప్రజాధనాన్ని సొంత సొమ్ముగా యథేచ్ఛగా అనుభవిస్తున్న ఈనాటి మన పాలకులు, నాయకులు ఆ మహనీయుని ఆదర్శాల్లో కనీసం కొన్నింటినైనా ఆచరించగలిగితే నేటి మన రాజకీయ, పాలనా వ్యవస్థ పునీతమై పోతుందనడంలో ఎంతమాత్రం సందేహంలేదు. ఏమంటారు?

★ ★ ★

యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407


లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

కథ

షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల



# సహాయం

**శివరామయ్య** తన అలవాటు ప్రకారం పార్కుకు వచ్చారు. చలికాలం కాబట్టి ఉదయం కాకుండా పది గంటల తరువాత వచ్చి రెండు రౌండ్లు వాకింగ్ చేసి ఓ బెంచి మీద కూర్చోవటం మాములు. ఆ సమయంలో సహజంగానే పార్క్‌లో జనాలు కొద్దిగా పలుచగా ఉంటారు. మామూలుగా తాను కూర్చునే బెంచి దగ్గరకెళితే దంపతులు కూర్చొని ఏదో చర్చించుకుంటు న్నారు. దగ్గర ఏదో ఆసుపత్రి రిపోర్టులు ఉన్నాయి. శివరామయ్య ప్రక్క బెంచిపై కూర్చున్నారు. యాంత్రికంగా అయితే వస్తున్నారు కాని శివరామయ్య గారికి పార్కులో సైతం టైమ్ పాస్ కావడం లేదు. అప్పుడే మిత్రుడు రహిమాన్‌తో మాట్లాడి ఫోన్ పెట్టేసినాడు. తమ ఊర్లో అయితే మిత్రులు, శిష్యులు అగుపిస్తుంటారు. చిన్న చితకా కార్యక్రమాలకు పిలుస్తుంటారు. కాలం సులభంగా గడిచి పోతుంటుంది. తనతోపాటే రిటైరైన రహిమాన్ తరచూ వస్తుం టాడు. పండుగలకు పిలుస్తుంటాడు. రహిమాన్‌కు ఇద్దరు అమ్మాయిలు, ఏనాడు ఆడపిల్లలు అనుకోడూ, అంతా అల్లాహ్ దయ అంటాడు. ఇద్దరు అల్లుళ్ళు వచ్చారు. హజ్‌కు వెళ్ళి వచ్చినాడు. ఊర్లో సమస్యలన్ని పైన వేసుకొని తిరుగుతుంటాడు. ఎంత బిజీ అయినా ఐదు పూటలా నమాజ్ వదలడు. రహిమాన్ లైఫ్ స్టైల్ తనకు ముచ్చటేస్తుంటుంది. ఎప్పుడూ ముఖంలో అలసట, కోపం అగుపించవు. లెక్చరర్ అయినా స్టూడెంట్స్‌తో ఫ్రెండ్లిగా ఉండేవాడు. తను ఆలోచనల్లో ఉండగానే ఇద్దరు దంపతులు దగ్గరికి వచ్చారు. ఇద్దరు చేతులు జోడిస్తూ తెలంగాణ యాసలో దవాఖాన కొచ్చాం అయ్యా, పైసలు ఎక్స్‌రేకు అయిపో యాయి, మూడు గంటలకు డాక్టరు వచ్చి ఫిలిం చూసి మందులు రాసిస్తారంట, మధ్యాహ్నం తినడానికి ఏమి తెచ్చుకోలేదు... అంటూ ఏదో చెబుతునే ఉన్నారు. ఇద్దరు వాస్తవంగానే అడుగుతున్నారు, శివరామయ్య ఐదువందల నోటు తీసి ఇచ్చారు. వాళ్ళు భోజనానికి ఓ వంద ఎక్స్‌పెక్ట్ చేసినట్టున్నారు, సంతోషంగా ఐదొందలు అందుకుని దండాలు పెట్టుకుంటు వెళ్ళిపోయారు.

సమయం పన్నెండు గంటలు కావస్తోంది. శివరామయ్య చిన్నగా లేచి ఇంటికి వెళుదామని బయలుదేరారు. గేటు దగ్గరికి వస్తూనే కళ్ళు తిరిగినట్లై తూలి పడిపోతూ గోడను పట్టుకొని కూర్చుండి పోయారు. అప్పుడే గేటు దాటిపోతున్న దంపతులు అయ్యాగారు! అంటూ పట్టుకుంటూ దగ్గర నీడలో కూర్చుండపెట్టి తమ దగ్గర వున్న బాటిల్‌లోని నీరు శివరామయ్య ముఖంపై కొట్టి, తటాపటా యిస్తూ తాగమని బాటిల్ అందించారు. రెండు గుటకలు నీరు త్రాగి, కొద్ది సేపటికి తేరుకున్న శివరామయ్య లేచి వెళ్ళటానికి సన్నద్ధం అయ్యారు. “అయ్యగారు కొద్దిసేపు కూర్చొండి, ఏదన్నా జూసో టెంకాయ బోండానో ఈయన తెస్తాడు” అంటూ టెంకాయ తీసుకుని రమ్మని భర్తను పురమాయించిందావిడ. శివరామయ్య వద్దని వారించి “ఏమి పర్వాలేదమ్మా, నేను వెళుతాను” అంటూ వారి సహాయానికి మరో ఐదు వందలు ఇవ్వబోయారు. వద్దయ్యాగారు మా వంతుగా చేసాం, డాక్టరు వచ్చే లోపు మా చిన్నోడు పైసలు తెస్తాడు అంటు పైసలు తీసుకో లేదు. వారి సంస్కారానికి మనసులో ధన్యవాదాలు తెలుపు కుంటూ ఆటో పిలిచీ వెళ్ళిపోయారు శివరామయ్య. ఇంటికి దూరంగానే ఆటో దిగి నడుచుకుంటు వెళ్ళారు. భార్య ఆటోలో దిగడం చూస్తే తానూ కళ్ళు తిరిగి కిందపడిపోయిన కథ చెప్పడం, ఆమె ఆందోళన చెందడం ఎందుకూ అని ఆయన ఆలోచన.

శివరామయ్య ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ప్రిన్సిపాల్‌గా రిటైరై ఐదు ఏండ్లు అవుతుంది. మంచి పెన్షన్, ఊర్లో ఇంటి అద్దె, ఉన్న పదెకరాల పొలానికి గుత్తా, ఫైనాన్స్ స్టేటస్ మంచిగానే ఉంది. ఇద్దరు సంతానం, మగపిల్లలు. భార్య ఈ సారైనా ఆడపిల్ల పుట్టవచ్చు మూడో సంతానంలో చివరిసారిగా చూద్దాం అంటే శివరామయ్య ససేమిరా వినకుండా రెండో కాన్పుకే ట్యూబక్టమి ఆపరేషన్ చేయించి స్పెషల్ ఇంక్రిమెంట్ కూడా తీసుకున్నారు. పిల్లలను పట్టణంలో మంచి స్కూల్‌లో, కాలేజి కూడా నగరంలో ఉంచి చదివించారు. పెద్దబ్బాయి తాను బైపిసి అంటే వద్దూ అంటూ యంపీసి చదివించాడు. చిన్నోడు మ్యాథ్స్ గ్రూపే తీసుకున్నాడు. ఎలాగైనా ఓ మూడు ఏళ్ళ తేడాలో ఇద్దరు ఇంజనీరింగ్, ఐటీలు పూర్తి చేసారు. శివరామయ్య అలసి పోకుండా డబ్బులు పంపేవారు. కుమారులు రానురానూ తలిదండ్రుల వద్ద గడిపే కాలమే తగ్గిపోయింది. కాలచక్రం తిరిగిపోతుంది. ఇద్దరికి అమెరికాలో ఉద్యోగాలు. పెద్దవాడు హైదరాబాద్‌లో పెద్ద అపార్టమెంటు తీసుకున్నాడు. చకచకా సంబంధాలు, పెళ్ళిళ్ళు అయిపోయాయి. కొడుకు కోడళ్ళతో ఓ ముచ్చట తీరలేదు. ఇద్దరు ఉద్యోగ రీత్య అమెరికాలో తాత్కాలికంగానే అంటూ సెటిల్ అయిపోయారు. శివరామయ్య గారు భార్యతో ఆరు నెలల కోసం అమెరికా వెళ్ళి, అక్కడ వారి దౌడు జీవితంలో ఇమడలేక మూడు నెలలకే ఇండియాలో వాలిపోయారు. శివరామయ్యకు భార్యకు ఈ మధ్య షుగర్, బీపిలు, మోకాళ్ళ నొప్పులు మామూలై పోయాయి. పిల్లలు హైదరాబాద్‌లో అపార్ట్‌మెంటు ఖాళీగా ఉంది, రోజు నెట్‌లో మాట్లాడవచ్చు, మంచి హస్పిటల్స్ ఉన్నాయని తల్లిదండ్రులను హైదరాబాద్ చేర్పించారు. ఊర్లోని ఇల్లు ఓ డాక్టర్‌కు అద్దెకు ఇచ్చి వచ్చేసినారు. తమకు తెలియకుండానే పిల్లల ఆదేశాలు పాటించాల్సి వస్తుంది. ముందు ముందు రోజూ మాట్లాడినా, రాను రాను వారానికి ఒకసారి, రెండు సార్లకే పరిమితం. రోజు మాట్లాడేది ఏముంటుంది? ఆరోగ్యం జాగ్రత్తగా.. బాగా తినండి, రోటీన్ టాక్. మనవలు అస్సలు జేజబ్బల వైపు చూడరు, వీళ్ళు చూసి తృప్తి పడటమే తప్పా. అమెరికా సమయానికి, ఇక్కడి సమయానికి రాత్రింబవళ్ళు తేడా కావడంతో కూడా సమయం కలిసేది కాదు. కోడళ్ళు యాంత్రికంగా మాట్లాడేవారు. తాము గీసుకున్న జీవిత చట్రంలో తామే బందీలు అయిపోయారు శివరామయ్య దంపతులు. పెళ్ళయిన కొత్తలో సంవత్సరానికి ఒకసారి, రెండేళ్ళకు ఇప్పుడు నాలుగేళ్ళు అయింది కొడుకు కోడళ్ళను చూసుకోక. బంధువులు, మిత్రులు మీకేం పిల్లలు అమెరికాలో ఉన్నారంటే గర్వంగా ఉండేది, ఆ మాట కాస్తా ఇప్పుడు ఏవగింపు అనిపిస్తుంది.

శివరామయ్య ఆలోచనలు తన యాంత్రిక జీవిత రచనలో తన పాత్రే అధికం అంటూ కుమిలిపోతున్నారు. కాలం అందుకోలేని దూరం వెళ్ళిపోయింది. అదే ఆలోచనలో అటూఇటూ తిరుగుతూ పడుకున్నారు. ఏ తెల్లవారుజామునో నిద్ర పట్టిన, చెమట పట్టి గుండె పట్టేసినట్టు అనిపించింది. భార్య దినం అంతా ఎదో పనిలో బిజీ.. అయినా ఎప్పుడూ పిల్లల ధ్యాసే, అలిసి నిద్ర పోతుంది. ఇంకో గంట అయితే ఏదో డాక్టర్ దగ్గరికి వెళ్ళవచ్చు అని చూస్తుంటే నొప్పి కాస్త ఎడమ భుజం వైపు ఎక్కువైతుంది. శివరామయ్య గట్టిగా దగ్గటం మొదలు పెట్టారు. దగ్గు శబ్దానికి భార్య నిద్రలేచి భర్త చెమట పట్టి ఉండటంచూసి భయపడి ఫ్యామిలి డాక్టర్‌కు ఫోన్ చేసింది. డాక్టర్‌కు నెలకింతా మాట్లాడుకున్నారు. రొటిన్ గా వచ్చి చెక్ చేయడం, మందులు ఇవ్వటం ఆయన బాధ్యత. తమ అపార్ట్మెంట్స్‌లో మరో రెండు ఫ్యామిలీలకు కూడా ఈ డాక్టర్ చూస్తుంటారు. త్వరగానే విచ్చేసిన డాక్టర్‌కు అర్థమైంది ఇది హార్ట్ ఎటాక్ అని. బీపి, ఆక్సిజన్ లెవెల్స్ పడిపోతున్నాయి. డాక్టర్ ఫోన్ చేసి అంబులెన్స్ పిలిపించారు. మగతగా కళ్ళుమూతపడ్డ శివరామయ్య కళ్ళు తెరిచి చూస్తె ఆసుపత్రిలో ఉన్నారు. రెండు స్టంట్స్ వేసిన బాడి అడ్జస్ట్ కావడానికి రెండు రోజులు పట్టింది. భార్య మాత్రం దగ్గరగా ఉంది. భర్తకు ఏదైనా అయితే.. ఆమె ఆ ఆలోచనలతో కుదేలు అయింది. రాత్రే కుమారులకు ఫోన్ చేసింది. మధ్యమధ్యలో ఫ్యామిలీ డాక్టర్ వచ్చి చూసి వెళ్ళాడు. పిల్లలు రాలేదు, పిల్లలు వస్తాం అనటం లేదు, వీడియో కాల్‌లో మాట్లాడుతున్నారు, బయటకు ఎందుకు వెళ్ళినారు, జాగ్రత్తలు చెబుతున్నారు. వద్దంటున్నా చెరో రెండు లక్షలు పంపినారు.

పదకొండు గంటలకు ఓ ఆవిడా ఆమె కొడుకు వచ్చారు. "అయ్య గారికి ఎమన్నా కావలా అమ్మగారు! మీకు ఏమన్నా టిఫిన్ తెమ్మంటారా? అయ్య గారికి ఏమికాదు లేండమ్మగారు" అంటూ ఆప్యాయంగా పలుకరిస్తూ, ధైర్యం చెబుతున్న వాళ్ళ శబ్దానికి శివరామయ్య కళ్ళు తెరిచి ఆవిడను గుర్తించారు. ఆ రోజు పార్కులో కనిపించిన దంపతుల్లో ఒకరు. దగ్గరికి పిలిచి ఏమైంది అమ్మా.. నీ భర్త ఎక్కడ అన్నారు. అయ్య గారు మీరు మాట్లాడ వద్దు అంటుండగానే భార్య అందుకుంది, మీరు పార్కులో సహాయం చేసారంటకదా, మీకు ఇక్కడికి తెచ్చి నప్పుడే గుర్తు పట్టి నాకు ధైర్యం చెబుతూ నర్సులు వారిస్తున్నా మాటిమాటికి ఈమె, కొడుకులు నాకు బలవంతంగా తినిపిస్తూ ఈవిడ నాతోనే

**మిగతా 17వ పేజీలో...**




# భారత్‌లో మత విద్వేష మంటలు

## వెల్లడించిన ప్యూ రీసెర్చ్ సెంటర్

**సామాజిక జీవనంలో** మత విద్వేషం బుసలు కొడుతున్న దేశాల్లో **భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజా నివేదిక వెల్లడించింది.** 2022 సంవత్సరంలో మొత్తం 198 దేశాల్లో పరిస్థితులను అధ్యయనం చేసిన ప్యూ సంస్థ తాజాగా ఆ వివరాలతో ఒక నివేదికను విడుదల చేసింది. 'సామాజిక వర్గాల మధ్య శత్రుత్వ భావన' (ఎస్‌హెచ్‌ఐ) ఇండెక్స్‌లో గరిష్ఠంగా 10 పాయింట్లకుగాను భారత్ 9.3 పాయింట్లతో తొలి స్థానంలో ఉందని ఈ నివేదిక తెలిపింది. తర్వాత స్థానాల్లో వరుసగా నైజీరియా (8.7), సిరియా (8.1), పాకిస్థాన్ (7.9), ఇరాక్ (7.8), ఈజిప్టు (7.4), ఆఫ్గనిస్థాన్ (7.3) నిలిచాయి. 7.2 పాయింట్లకన్నా ఎక్కువ ఉన్న దేశాలను సామాజిక అశాంతి అత్యధిక స్థాయిలో నెలకొన్న దేశాలుగా ప్యూ సంస్థ వర్గీకరిస్తుంది. మతం కారణంగా ఒక వర్గం ప్రజల్ని వేధింపులకు గురి చేయటం, మూకదాడులు జరపటం, ఉగ్రవాదం, మిలిటెంట్ చర్యలు, మతమార్పిళ్లపై ఉద్రిక్తతలు, మతపరమైన సంకేతాలు, వేషధారణపై ఆంక్షలు వంటి అంశాల ప్రాతిపదికన ఎస్‌హెచ్‌ఐ ఇండెక్స్‌లో దేశాలకు స్కోరు కేటాయిస్తారు. ఒక నిర్దిష్ట మతంపై లేదా కొన్ని మతాలపై ప్రభుత్వం నిర్బంధం విధించే అంశం ఆధారంగా ప్యూ సంస్థ జీఆర్‌ఐ అనే మరో ఇండెక్స్‌ను రూపొందించింది. ఈ ఇండెక్స్‌లో భారత్ పరిస్థితి కొంత మెరుగ్గానే ఉన్నట్లు తెలిపింది.

జీఆర్‌ఐ ఇండెక్స్‌లో 10 పాయింట్లకుగాను భారత్‌కు 6.4 స్కోరు చేసింది. 6.6లేదా అంతకంటే ఎక్కువ పాయింట్లు ఉన్న దేశాలను అత్యధిక ప్రమాదంలో ఉన్న దేశాలుగా ప్యూ వర్గీకరిస్తుంది. వీటిలో 8.4 పాయింట్లతో ఈజిప్టు తొలిస్థానంలో నిలవగా.. తదుపరి స్థానాల్లో ఆఫ్గనిస్థాన్ (8.2), ఇరాన్ (8.2), సిరియా (7.9), ఇండొనేషియా (7.9) ఉన్నాయి. ఎస్‌హెచ్‌ఐ, జీఆర్‌ఐ ఇండెక్స్‌లు రెండింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. 25 దేశాల్లో పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని తెలిపింది. వాటిలో భారత్, నైజీరియా, సిరియా, పాకిస్థాన్, ఇరాక్ తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. 62 దేశాల్లో జీఆర్‌ఐ, ఎస్‌హెచ్‌ఐ స్కోరు తక్కువగా లేదా సాధారణ స్థాయిల్లో ఉంది. వీటిలో కెనడా, దక్షిణ కొరియా తదితర దేశాలున్నాయి. 16 దేశాల్లో జీఆర్‌ఐ చాలా ఎక్కువగా ఉన్నప్పటికీ ఎస్‌హెచ్‌ఐ తక్కువగా ఉంది. అంటే, ప్రభుత్వ

ఆంక్షల తీవ్రత అధికం కానీ, ప్రజల మధ్య మతపరమైన ఉద్రిక్తతలు లేవు. ఈ దేశాల్లో చైనా, క్యూబా ఉన్నాయి. 10 దేశాల్లో జీఆర్ఐ తక్కువగా ఉన్నప్పటికీ.. ఎస్‌హెచ్ఐ ఎక్కువగా నమోదైంది. అంటే, ప్రభుత్వ ఆంక్షలు లేకపోయినా మైనారిటీల మీద విద్వేషం ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి దేశాల్లో బ్రెజిల్, ఫిలిప్పీన్స్ మొదలైనవి ఉన్నాయి.

### ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితి

2021తో పోల్చితే జీహెచ్ఐ అత్యధికం నుంచి అధికం ఉన్న దేశాల సంఖ్య 55 నుంచి 59కి పెరిగింది. కాగా, 2007లో ప్యూ తన సర్వే నివేదికలను విడుదల చేయటం ప్రారంభించినప్పుడు.. ప్రపంచంలో 40 దేశాలు మాత్రమే మతపరమైన వివక్ష, ఉద్రిక్తతలు అత్యధికంగా ఉన్న జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతం వాటి సంఖ్య 45కి పెరిగింది. కాగా, మతపరమైన సమూహాలపై ప్రభుత్వ పరంగా ఆంక్షలు ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయాయని, 198 దేశాలకుగాను 186 దేశాల్లో ఈ పరిస్థితి ఉందని ప్యూ నివేదిక వెల్లడించింది. అమెరికాకు చెందిన ప్యూ రీసెర్చ్ సెంటర్ వివిధ దేశాల్లో పరిస్థితులను సామాజిక అంశాల వారీగా విశ్లేషించి నివేదికలు విడుదల చేస్తుంది.

**('ఆంధ్రజ్యోతి' సౌజన్యంతో...)**

15వ పేజీ తరువాయి...

# సహాయం

ఉంది. వీళ్ళు ధైర్యం చెప్పకుంటే తానూ చాలా భయపడి పోయేది. అయ్యగారు మా ఆయన కూడా కింద వార్డులో ఉన్నాడు, ఛాతి మీద చిన్న గడ్డ ఉంటే పరిక్ష చేసి క్యాన్సర్ కాదని తీసివేసినారు. అన్నం కూడా తింటున్నడు, మీ మాట చెపితే వస్తానంటుండ్రు. మధ్యాహ్నం డాక్టర్‌ను అడిగి తీసుకొస్తాం అంది. అంతలోనే డాక్టర్ చెకింగ్‌కు వస్తున్నారని నర్స్ అందరిని బయటకు పంపించి వేసింది.

డాక్టర్ మధు గారు రౌండుకు వచ్చి "ఏమండి శివరామయ్య గారు ఎలా ఉంది? ఏమైనా నొప్పి ఉందా, మీకు సిగరెట్లు అవి తాగే అలవాటు లేదు కాబట్టి సరి పోయింది. సాయింత్రం ఓసారి చెక్ చేసి రిలీవ్ చేస్తాను, వారం తరువాత ఓసారి చూపించుకోండి, మళ్ళీ నెలకు వచ్చి చెక్ చేసుకోవాలి. ట్యాబ్లెట్లు రాసిస్తారు. జాగ్రత్తగా వేసుకోవాలి, నర్స్ చెబుతుంది ఎలా వాడాలో. ఏమన్నా దిగులు పడుతున్నారా? రిలాక్స్‌గా ఉండాలి. రెక్కలొచ్చినాక పక్షులు ఎగిరిపోవడం సహజమే!" అంటూ. తలుపు దగ్గర తొంగి చూస్తున్న ఆవిడని పిలిచి సంకమ్మా మీ ఆయన ఎట్టుండూ రేపు ఇంటికి పంపుతలే అంటుంటే, లోపలికి వస్తూ శివరామయ్యను చూపిస్తు ఈ సారు చాలా మంచోడు సారు, జర బాగా చూడు సారు అంటూ బతిమలాడుతుంది. ఈ సార్ నీ కెరుకా.. మంచిగైంది. తొందరగా తీసుకుని రావడంతో ప్రాణాపాయం తప్పింది. మంచిగా ఉన్నాడులే అంటూ అసిస్టెంట్ డాక్టర్‌కు బిల్లు తయారు చేయండి అంటూ ముందు వెళ్ళిపోయారు. మిత్రుడు రహిమాన్ ఆతురతతో వచ్చాడు. "శివా ఎలా ఉన్నావు? రెండు రోజుల నుండి ఫోన్ ఎత్త లేదు. నిన్న రాత్రి చెల్లెమ్మ నా మిస్డ్ కాల్స్ చూసి ఫోన్ చేసి చెప్పింది. ఉండలేక పోయానురా.. ఎలా ఉంది" అని మిత్రుని చేతిని నిమురుతూ కళ్ళలో నీరు పెట్టుకున్నారు. శివరామయ్య మిత్రుని వారిస్తు "మీ అందరి ప్రేమ నన్ను బ్రతికించింది అంటూ అమ్మాయి కానుపు అయిందా" అని అడిగారు. "నా రెండవ కూతురు కాన్పుకు ఆసుపత్రి తీసుకెళ్ళారు, నీ విషయం తెలుస్తూనే ఉండలేక పోయాను, బస్సుల్లో సీట్లు లేవు, ఓ ప్రైవేటు బస్సులో డ్రైవర్లను బ్రతిమాలి డ్రైవర్ వెనుక కూర్చొని వచ్చాను. సరెలే నిన్ను చూసాను, ప్రాణం కుదుట పడింది" మిత్రుని తనివితీరా చూసుకున్నారు రహిమాన్.

శివరామయ్యకు కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి, అవి బాధనా ఆనంద భాష్పాలో తెలియలేదు. కాని తను మామూలుగా చేసిన సహాయం తనకు ఇంత తొందరగా సహాయ పడుతుందని ఆప్యాయంగా ఆదుకుంటుందని తెలియదు. తనను ఆ స్థితిలో చూస్తున్న భార్యకు వాళ్ళు తోడుగా ఉండకుంటే... ఆలోచించలేక పోయాడు. అమెరికా నుంచి ఇద్దరు పిల్లలు బయలు దేరారని, రేపు సాయింత్రానికి తమ దగ్గరికి వాలుతారని మెసేజ్ రావటం మరింత ఆనందానికి లోను చేసాయి శివరామయ్య దంపతులకు. సాయింత్రం వెళుతూ సుంకమ్మ దంపతులను చూసి, వాళ్ళు వద్దంటున్నా పదివేలు బట్టలు తెచ్చుకోండమ్మా, అన్న లాంటొణ్ణి వద్దనకూడదని బలవంతంగా ఆవిడ చేతిలో పెట్టి, ఆమె భర్తను పలకరించి, చిన్నగా బయటికి అడుగులు వేసారు శివరామయ్య దంపతులు.

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

# 44. అద్ దుఖాన్

మక్కా అవతరణ

51 – 57 దైవభక్తిపరాయణులయిన వారు, ప్రశాంతస్థలిలో ఉంటారు. తోటల్లో, సెలయేరుల్లో, పల్చని పట్టు పీతాంబర జలతారు వస్త్రాలు ధరించి, ఎదురుబొదురుగా కూర్చుని ఉంటారు. అలా ఉంటుంది వారి వైభవం. మరి మేము పసిడి వన్నెల హరిణాక్షులయిన కన్యలను వీరికిచ్చి పెళ్ళిచేస్తాము. వారక్కడ అన్నివిధాల రుచికరమయిన పదార్థాలు సంతృప్తిగా కోరి తెప్పించుకుంటారు. వారక్కడ మృత్యువు రుచిని ఎన్నటికీ చవిచూడరు, ప్రపంచంలో వచ్చిన మృత్యువేదో అదే సరి. అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని నరక యాతన నుండి కాపాడుతాడు,[44] ఇదే మహత్తరమయిన సాఫల్యం.

58 – 59 ప్రవక్తా, మేము ఈ గ్రంథాన్ని నీ భాషలోనే సులభతరం చేసిపెట్టాము, తద్వారా ఈ జనం హితబోధను గ్రహించాలని. ఇక నీవూ నిరీక్షించు, వీరున్నూ నిరీక్షిస్తూ ఉంటారు.[45]

44. ఈ ఆయత్లో రెండు విషయాలు గమనార్హమయినవి:

ఒకటి, స్వర్గంలోని అనుగ్రహాల ప్రస్తావన జరిగిన తరువాత నరకం నుండి కాపాడబడే ప్రస్తావన ప్రత్యేకంగా వేరుగా చేయడం జరిగింది. వాస్తవానికి ఒక వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించాడంటే, అతడు తప్పనిసరిగా నరకాన్ని తప్పించుకున్నాడన్న భావం అనివార్యంగా దానంతట అదే వస్తుంది. అయినా ఈ ప్రస్తావనకు గల కారణం ఏమిటంటే, విధేయతకు ప్రాప్తమయిన బహుమానానికి విలువ మనిషికి పూర్తిగా అవగతమవ్వాలంటే అవిధేయతకు పాల్పడినవారు ఎక్కడికి చేరుకున్నారో, వారెటువంటి దుష్పరిణామానికి గురయ్యారో కూడా అతని సమక్షంలో ఉన్నప్పుడే ద్యోతకమవుతుంది.

రెండవ గమనార్హమయిన విషయం ఏమిటంటే, ఈ వ్యక్తులు నరకాన్ని తప్పించుకుని స్వర్గంలో ప్రవేశించడం తన అనుగ్రహానికి ఫలితంగా జరిగిందని పరమ ప్రభువు చెబుతున్నాడు. దీనిద్వారా మనిషిని హెచ్చరించడం ఉద్దేశ్యం. అల్లాహ్ అనుగ్రహం ఒక వ్యక్తికి తోడు కానంతవరకు అతనికి సాఫల్యం ప్రాప్తమవడం సాధ్యం కాదు. మనిషికి బహుమానం అతని సదాచరణకే ప్రాప్తమయినా, అసలు సదాచరణకు కలిగే సద్బుద్ధి అల్లాహ్ అనుగ్రహం లేకుండా ఎలా ప్రాప్తమవుతుంది. పైగా మనిషిచేత సాధ్యమయ్యే అత్యుత్తమమయిన సదాచరణ కూడా ఎన్నటికీ సంపూర్ణమూ, పరిపూర్ణమూ కాజాలదు. అందులో ఏ కోణంలోనూ కొరత లేదని చెప్పడానికి వీలవదు. అల్లాహ్ అనుగ్రహం కారణంగానే దాసుని బలహీనతలు, అతని ఆచరణల లోపాల ఎడల చూపోపు వహించి అతని సేవల్ని స్వీకరించడమూ జరుగుతుంది, బహుమానాలతో అతన్ని సత్కరించడమూ జరుగుతుంది. అలాకాక నిశిత దృష్టితో ఆయన లెక్క చూడటానికి ఉపక్రమిస్తే తన శక్తి సామర్థ్యాల ద్వారా స్వర్గాన్ని గెలుచుకోగలనని ప్రకటించే సాహసం చేయగలవాడెవడు? ఇదే విషయాన్ని ఒక హదీసులో దైవ సందేశహరులు ఉటంకించారు, ఆయన ఇలా పురమాయించారు, "ఆచరణ చేయండి, శక్తిమేరకు అత్యంత సక్రమంగా చేయడానికే ప్రయత్నించండి. అయితే బాగా తెలుసుకోండి, ఏ వ్యక్తికీ అతని ఆచరణ ఒక్కటే స్వర్గంలోకి ప్రవేశింపజేయదు." అక్కడున్న జనం అడిగారు, "ప్రవక్తా, మీ ఆచరణ కూడానా?" "అవును నేను సయితం నా ఆచరణ ఆధారంగా స్వర్గంలోకి ప్రవేశించలేను, నా ప్రభువు తన కారుణ్యంతో నన్ను కప్పుకుంటే తప్ప" అని సెలవిచ్చారు.

45. అంటే, ఇప్పుడు ఈ జనులు మార్గబోధన స్వీకరించక పోతే చూస్తూ ఉండు వారికి ఎలా శాస్తి జరుగుతుందో, వీరూ నిరీక్షిస్తున్నారు, నీ సందేశానికి ఎటువంటి పరిణామం ప్రాప్తమవుతుందో చూద్దామని.

**-: సమాప్తం :-**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

### అధ్యాయం : 54

## ప్రాజ్ఞతకు చేరని వ్యక్తి నమాజ్‌కు సారథ్యం వహించటం

**171)** అబూ ఖిలాబా కథనం: అమ్ర్ బిన్ సలమా(రజి) దగ్గరకు వెళ్ళి 'ఆ విషయం గురించి' ఎందుకు అడగరు? అని కొందరు నాతో అన్నప్పుడు నేను అమ్ర్ బిన్ సలమా(రజి) దగ్గరకు వెళ్ళి నాకు కలిగిన సందేహాన్ని వెల్లడించాను. ఆయన నా సందేహానికి సమాధానమిస్తూ ఇలా అన్నారు: అజ్ఞాన కాలంలో మేము ఒక చెలమ దగ్గర నివసించేవారం. అది ప్రజల రాకపోకల మార్గం. వాహన దారులు మా దగ్గరి నుండి సాగిపోతున్నప్పుడు, 'జనులు (ఆ వ్యక్తి గురించి) ఏమనుకుంటున్నారు? ఇప్పుడు అతని పరిస్థితి ఎలా ఉంది?' అని అడిగేవారం (దైవప్రవక్త ముహమ్మద్- సఅసమ్-ను దృష్టిలో పెట్టుకుని వేసే ప్రశ్నలివి). దానికి ఆ ప్రయాణీకులు, 'అల్లాహ్ తనను ప్రవక్తగా చేసి పంపాడని, అల్లాహ్ తనపై దివ్యవాణిని అవతరింపజేస్తున్నాడని లేదా 'వహీ' అవతరింపజేశాడని ఆయన అంటున్నారు (వారు ఖుర్ఆన్‌లోని ఏదయినా ఒక ఆయత్‌ను కూడా వినిపించేవారు)'. నేను ఆ ఆయత్‌ను అప్పటికప్పుడే కంఠస్థం చేసుకునేవాణ్ణి. ఆ వాక్యాలు నా హృదయ కవాటాలను తట్టేవి. మరోవైపు అరబ్బులు తమ ఇస్లామ్ స్వీకార నిర్ణయాన్ని మక్కా విజయం వరకూ వాయిదా వేశారు. వారిలా అనేవారు: 'ఈ ప్రవక్తను ఆయన జాతి ప్రజలతో (ఖురైషులతో) తలపడనివ్వండి. ఒకవేళ ఆయన గనక వారిపై ఆధిపత్యం వహిస్తే ఆయన నిజంగానే సత్యవంతుడైన ప్రవక్త అయి వుంటారు.'

మక్కా విజయం తర్వాత అన్ని తెగలవారు ఇస్లామ్ స్వీకరించటంలో ముందంజ వేశారు. మా నాన్నగారు కూడా తన తెగవారందరితో సహా ఇస్లామ్ స్వీకరించటంలో శీఘ్రత కనబరిచారు. ఆయన గారు మదీనా నుండి తిరిగి వచ్చినప్పుడు, 'దైవసాక్షిగా! నేను సత్యవంతుడైన ఒక ప్రవక్త దగ్గరి నుండి వస్తున్నాను' అని అన్నారు. ఆయన ఏమన్నారంటే, "ఫలానా నమాజ్ ఫలానా వేళ ఈ ఈ విధంగా చేయండి. నమాజ్ వేళ కాగానే మీలోని ఒక వ్యక్తి అజాన్ ఇవ్వాలి. అందరికన్నా అధికంగా ఖుర్ఆన్ కంఠస్థం అయివున్న వ్యక్తి నమాజ్‌కు సారథ్యం వహించాలి" అన్నారు.

అప్పుడు తెగలోని జనులు, తమలో ఖుర్ఆన్ ఎక్కువగా కంఠస్థం అయివున్న వారెవరు? అని తర్జనభర్జన చేసుకున్నారు. నాకన్నా ఎక్కువగా ఖుర్ఆన్ కంఠస్థం అయివున్నవారెవరూ తెగవారికి దొరకలేదు. అందుచేత వారు నన్నే తమ ఇమామ్‌గా చేసుకున్నారు. నిజానికి అప్పటికి నా వయసు ఆరు లేక ఏడు సంవత్సరాలే. నా దగ్గర ఒక దుప్పటి ఉంది. నేను దానిని చుట్టుకుని (నమాజ్‌లో) సజ్దా చేసినప్పుడు, నా శరీరంలోని వెనుక భాగం నగ్నం అయిపోయేది. 'ముందు మీ ఖారీ (ఖుర్ఆన్‌ను పఠించేవాని) పిరుదుల్ని కప్పి ఉంచండి' అని తెగకు చెందిన మహిళ చురక అంటించింది. చివరకు వారు ఒక వస్త్రాన్ని కొనుగోలు చేసి, నా కోసం ఒక (పొడవాటి) చొక్కాను కుట్టించారు. నాకు ఆ చొక్కా తొడగటం వల్ల కలిగినంత సంతోషం మరే వస్తువు వల్ల కూడా కలగలేదు.[1]

171-1. ప్రాజ్ఞతకు చేరని అబ్బాయి (నా బాలిగ్) కూడా నమాజ్‌కు సారథ్యం వహించటం సరైదేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. కాకపోతే ఆ అబ్బాయికి శుచీశుభ్రతల గురించి, విధుల (ఫరాయెజ్) గురించి, నఫ్ల్ (స్వచ్ఛంద) ఆరాధనల గురించి అవగాహన ఉండాలి. షాఫియీలు, అహ్లె హదీసు వారు ఈ పంథాకు అనుకూలంగా ఉన్నారు. అయితే హనఫీలు మాత్రం దీనితో విభేదించారు. 'నా బాలిగ్' అబ్బాయి ఫరాయెజ్‌లకు సారథ్యం (ఇమామత్) వహించటం సమ్మతం కాదన్నది హనఫీ పంథా.

★★★

3

# ఇస్లామీయ ఉద్యమం- దాని క్రమవికాసం

- ఎస్.ఎమ్. మలిక్

## మన దేశం

భారతదేశంలోని సమాజం విభిన్న సామాజిక రూపాల కూటమి. ఇటువంటి సముదాయంలో ఇస్లామీయ సామాజిక వ్యవస్థ స్థాపన అనేక ఇబ్బందులతో కూడుకున్నదే కాదు, అనేక కుశంకలకు కూడా కారణభూతమవుతుంది. అందువల్ల ఇక్కడ ఇస్లామ్, ముస్లిములు, ఇస్లామీయ ఉద్యమం- వీటిని గురించి వ్యాపింప జేయబడిన అనేకానేక అపోహలు, అపార్థాలను తొలగించడం, ఇస్లామ్ జీవనదాయక సందేశాన్ని సర్వ సామాన్యం చెయ్యడానికి ప్రయత్నించడం ప్రథమావశ్యకత. ఇలా చెయ్యడం ఇస్లామీయ ఉద్యమ ధ్యేయ సాధనలోని రెండవ అంశం. ఇస్లామీయ సమాజ నిర్మాణం కొరకు ఇది ఎంతో ప్రముఖమయింది. అంతేకాదు ఈ దశలో, అపార్థాలను తొలగించడం జరక్కపోతే సత్సమాజ నిర్మాణం సాధ్యమయ్యే విషయం కాదు. ఇంకా ముస్లిముల ద్వారానే ఈ కార్యరంగంలో, సత్సమాజ నిర్మాణంలో ఏదయినా చెయ్యగలగటం సాధ్యమవుతుంది. అయితే ముస్లిములు ఉపఖండం అనిపించుకునే మన దేశంలో ఎల్లెడలా చెల్లా చెదురయి విస్తరించి ఉన్నారు. వారిని ఈ ధ్యేయ సాధనకు సమాయత్తపరచడం ఒక ఎత్తయితే, మరో ఎత్తు, ఈ దేశవాసుల 85 శాతం ప్రజలు ఇస్లామ్ గురించి ఎరుక లేమికి గురయి ఉండగా వారి మధ్యన వారిలోని ఓ వర్గం పనికట్టుకుని ఇస్లామ్ పట్ల అపార్థాలను వ్యాపింపజేస్తూ విద్వేషాన్ని రెచ్చగొడుతూ ఉంటే ఈ కార్యక్రమం సజావుగా సాగడం దుర్లభమయిపోతుంది. అటువంటి వాతావరణంలో ఇస్లామ్ సందేశాన్ని ప్రజా సామాన్యంలో ప్రచారం చెయ్యడం, ఇస్లామ్ పట్ల ప్రజాభిప్రాయాన్ని మలచడానికి ప్రయత్నం చెయ్యడం అనివార్యమే అయినప్పటికీ ఆ కృషి సలపడం ఎంత కష్టభూయిష్టమయినదో ద్యోతకమవుతూనే ఉంది.

**ఉద్యమంలో చేరుతున్న నవతరానికి ప్రత్యేకం**

దీన్ని మరో కోణంలోనూ పరిశీలించవలసి ఉంటుంది. ఇస్లామీయ జీవన వ్యవస్థ సంస్థాపనకు కృషి చేసే ఓ ఉద్యమం దేశంలో నెలకొని ఉండగా ఈ దేశంలో దేశవాసుల ఓ పెద్ద సంఖ్య (85 శాతం) సత్యధర్మం పట్ల సరయిన అవగాహన లేకపోవడంచేత అది విద్వేష భరిత ప్రచారానికి లోనయి, ఇస్లామ్ జీవన దాయక సందేశానికి వంచితులై ఉండటం సమంజసమేనా? ఈ దేశ ప్రజలు ఇటు తమ ప్రాపంచిక సమస్యలకు సరయిన, సమంజసమయిన, దైవ ప్రసన్నతకు అర్హత కల్పించే, సమాధానం దొరక్క ఇక్కట్లు అనుభవిస్తూ జీవించి ఆ తరువాత పరలోకం చేరినప్పుడు కూడా దైవ కారుణ్యానికి నోచుకోక పోవడం సరయినదేనా? ఇస్లామీయ సముదాయం, ఓ సముదాయంగానూ, ముస్లిములు తమ వ్యక్తిగత స్థాయిలో ఒక్కొక్క వ్యక్తిగానూ తమ విధ్యుక్త బాధ్యతను

# ఉద్యమ క్రమ వికాసంలో కీలక పాత్రధారులు


మౌలానా అబుల్ లైస్ ఇస్లాహీ
(1948-1972)


మౌలానా ముహమ్మద్ యూసుఫ్
(1972-1982)


మౌలానా అబుల్ లైస్ ఇస్లాహీ
(1982-1989)


మౌలానా సిరాజుల్ హసన్
(1989-2003)


డాక్టర్ అబ్దుల్ హఖ్ అన్సారీ
(2003-2007)


మౌలానా సయ్యిద్ జలాలుద్దీన్ ఉమరీ
(2007-2019)


జనాబ్ సయ్యిద్ సాదతుల్లాహ్ హుసైనీ
(2019- 2027)

మరచి, వారికి సత్యధర్మాన్ని చేరవేసే బృహత్తర కార్యక్రమాన్ని విస్మరించడం సబబేనా? ఇవీ ఇలాంటి మరి కొన్ని ప్రశ్నలు ముస్లిములను సూటిగా నిలదీస్తున్నాయి.

## దీర్ఘకాలిక కర్తవ్యం

కాబట్టి, ఇస్లామ్ సందేశానికి వంచితులయిన 85 శాతం ప్రజా బాహుళ్యానికి సందేశం అందజేసే కార్యం ఆవశ్యకత, ప్రాముఖ్యత, దాని ఘన పరిమాణం దృష్ట్యా ఇస్లామీయ ఉద్యమం సుదీర్ఘ కాలం వరకు ఈ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉండటం తప్పనిసరి అని భావించింది. స్వయంగా ఉద్యమ కార్యకర్తల్లో ఈ స్పృహ జాగరూకమయి, వారు ప్రముఖంగా దీని వైపునకు పూర్తిగా కార్యోన్ముఖులయ్యేంతవరకు, వారిలో ఈ కార్యనిర్వహణకు అవసరమయ్యే సామర్థ్యం కావలసినంతగా పెంపొందనంతవరకు, ఇంకా ముస్లిమ్ సముదాయంలోనూ దీని స్పృహ జాగృతమయ్యేవరకు ఈ కార్యక్రమాన్ని ఇస్లామీ ఉద్యమ కార్యక్రమాలలో ప్రప్రథమమయినదిగా, ప్రముఖమయినదిగా చేర్చడం అత్యంతావశ్యకం. మరెన్నో సామూహిక కార్యాలకన్నా, సాంఘిక కార్యక్రమాలకన్నా ఇది ప్రాధాన్యతను సంతరించుకుం టుంది. అలాగే దాన్ని ప్రధానంగా, ప్రముఖంగా నిర్ణయించడం కూడా అవశ్యమయింది.

## పరిస్థితులు, సాధనా సంపత్తి

విభిన్న దృక్పథాలు, వివిధ భావనల కూడలి అయిన మన దేశంలో జన జీవనరంగంలో, రాజకీయ వ్యవస్థలో తగినట్టుగానే మనం ప్రజాస్వామిక విధానాన్ని ఎన్నుకున్నాము, దాన్నే పటిష్టంగా పాటిస్తూనే ఉన్నాము. అయితే రాజకీయాలు అతలాకుతలమయి పోతూ ఉంటాయి. ఒక్కోసారి నిరంకుశ, నియంతృత్వ ధోరణుల వారు గద్దెనెక్కితే, మరోసారి తీవ్రవాద జాతితత్వం కలవారు

పరిపాలనా పగ్గాలు చేపట్టారు. మరోసారి మతతత్వ వాదులూ పరిపాలనలో ఉన్నారు, వీరు దేశ వాతావరణాన్ని కలుషితం చేసివేశారు. ఇంకా ఇస్లామీయ ఉద్యమ కార్యకలాపాలలో కూడా అంతరాయానికి కారకులయ్యారు. ఇలాంటి సందర్భాలన్నింటిలో ప్రజాస్వామిక, మతతత్వ రహిత వాతావరణం బాగా దెబ్బ తిని అనేకానేక ఆశంకలు ఉత్పన్నమయ్యాయి. ఇటువంటి విపత్కర కాలంలో దేశంలోని రాజకీయ వాతావరణాన్ని ప్రభావితం చేసి, ప్రజాస్వామిక, మతతత్వ రహిత రాచబాటపైకి దేశాన్ని మరలించే ప్రయత్నమూ చేయవలసి వచ్చింది ఇస్లామీయ ఉద్యమానికి. అందువల్ల ఈ కృషి కూడా ఉద్యమ కార్యక్రమంలో భాగమయి పోయింది. ఇది చాలా పరిమిత స్థాయిలో, పరిమిత కాలంలో చేసినా దానికి ఉద్యమ కృషిలో చోటు కల్పించడం తప్పనిసరి అయింది. ఆ విధంగానే ఉద్యమం భౌతికంగానూ నిలువగలదు, తన సంఘ నిర్మాణ కార్యకలాపాలను ముందుకు తీసుకు వెళ్ళగలదు.

### సామూహిక కృషి

మన దేశంలో ప్రజా బాహుళ్యం అనేకానేక చిక్కు సమస్యల్లో నలిగిపోతున్నది. రాజకీయ రంగంలో, సామాజిక వ్యవస్థలో, ఆర్థిక రూపంలో బహు విధమయిన సమస్యలతో ప్రజలు తికమక పడుతున్నారు. ఈ సమస్యల నుండి తేరుకోగలిగితే కదా వారు జీవితంలో నెమ్మది పొంది, దాని నైతిక, ఆధ్యాత్మిక కోణాలను గురించి ఆలోచించడానికి?! సోదర దేశ వాసులకు ఈ సమస్యల నుండి బయటపడే దారి చూపుతూ వాటి ఆచరణాత్మక పరిష్కారంలో సయితం కృషి సలపవలసి ఉంటుంది. అప్పుడే వారు జీవితం పట్ల కాస్త గంభీరంగా ఆలోచించి ముందడుగు వేయగలుగుతారు.

అయితే ఇస్లామీయ ఉద్యమం వద్ద, ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ఏమయినా అవసరమయిన ఆచరణాత్మక చర్యలు గైకొనడానికి తగినంత సాధనా సంపత్తీ లేదు, మానవ వనరులూ లేవు. ఇలా సంభవమయితే ఉద్యమానికి అంతకన్నా సంతోషకరమయిన విషయం మరేదీ కాకపోయేది. అందువల్ల ప్రస్తుతం ఆ గడ్డు సమస్యల పరిష్కారం కొరకు ఇస్లామీయ బోధనల్ని పరిశీలించవలసిందని వాటి వైపునకు దృష్టి మళ్లించడం తప్ప అది మరే కృషి కూడా చేయజాలని స్థితిలో ఉంది.

ఉద్యమం ప్రస్తుతం ఈ దశలో సాధ్యమయినంత మేర ఆ కృషిలోనే నిమగ్నమయి ఉంది. ఇస్లామీయ బోధనల వెలుగులో ఆ సమస్యల పరిష్కారానికి సాధ్యమయ్యే ఆచరణాత్మక విధానాలను దేశవాసుల సమక్షంలో పెట్టే కృషి సలుపుతోంది. నమూన రూపేణ ఏదయినా ఒకటీ అరా ఏదయినా పని చేసి చూపెట్టడానికీ ప్రయత్నిస్తోంది. వాస్తవానికి ఈ విషయం చాలా కష్టమయినది. కాని అది ఉద్యమానికి అవసరమే, దేశవాసులకు మరీ అవశ్యమయినదే. ఎందుకంటే మనమూ ఈ దేశంలోనే, ఈ సమస్యలను అనుభవిస్తూ ఉన్నాము. ఈ సమస్యల పట్టిక నేడు ఒకటుంటే రేపు మరొకటి ముందుకు వస్తుంది. అయితే గమనార్హమయిన అంశం ఏమిటంటే ఈ సమస్యల పట్ల ఉద్యమ కార్యకర్తలు జాగరూకులయి, సరయిన అవగాహన కలిగి మెలగాలి. వీటి పరిష్కారం కొరకు సోదర దేశవాసులకు చేదోడు వాదోడుగా నిలువాలి. ఇలా కలసి మెలసి సమస్యల పరిష్కారం కొరకు ప్రయత్నించడం, వాటిని అధ్యయనం చేసి ఇస్లామీయ దృష్టితో పరిష్కారాన్ని వెదికే ప్రయత్నం చెయ్యడం మరీ అవసరం.


## చందాదారులకు విజ్ఞప్తి

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




**దళితులు-ముస్లిములను** బీజేపీ ప్రభుత్వం శత్రువులుగా చూస్తోందని, దళితులు, ముస్లిములు ఏకమై బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలని పలువురు మైనారిటీ, దళిత నాయకులు పిలుపునిచ్చారు. దళితులు, ముస్లిములు తమ అంతర్గత విభేదాలను పక్కనపెట్టి తమ హక్కుల సాధన కోసం పరస్పరం సమైక్యంగా పోరాడాలని అన్నారు. జనవరి 2న ముస్లిమ్ ముషావరతీ కౌన్సిల్- దళిత్ బహుజన్ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. హైదరాబాద్‌లోని దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ముస్లిమ్ ముషావరతి కౌన్సిల్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. బామ్సెఫ్, దళిత్ బహజన్ ఫ్రంట్, ఏఐఎస్ఎఫ్, సమతా సైనిక్ దళ్, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్, పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మాదిగ సంఘాల మహా కూటమి, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తదితర సంఘాల ప్రతినిధులు ఈ సమావేశంలో మాట్లాడారు. జమాఅతె ఇస్లామీహింద్ తెలంగాణ ఉపాధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోయెబ్ అధ్యక్షత వహించారు. దళితులు-ముస్లిముల మధ్య అంతరాలను దూరం చేసి సంఘటితం చేయడమే ఈ సమావేశ లక్ష్యమని అబ్దుల్ మజీద్ షోఐబ్ అన్నారు. తామంతా ఏకమై రాజ్యాంగ పరిరక్షణకోసం పోరాడతామని పాల్గొన్న నాయకులంతా ముక్తకంఠంతో తీర్మానించారు. తామంతా ఇక్కడ కలిసి కూర్చునే అవకాశం మన రాజ్యాంగం కల్పించిందని వెల్ఫేర్ పార్టీ అధ్యక్షులు కమాల్ అతహర్ అన్నారు. దళితులు, ముస్లిమ్ సామాజిక వర్గంలో రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలన్న ప్రాముఖ్యతను సమావేశం గుర్తించింది. హిందుత్వ శక్తులు ముస్లిములు, దళితులపై దాడులకు తెగబడుతున్నాయని మాదిగ సంఘాల కూటమి సెక్రటరి కిరణ్ మాదిగ ఆందోళన వెలిబుచ్చారు. ఈ దాడులను తిప్పికొట్టేందుకు సరైన కార్యాచరణ చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ముస్లిములు బాబా సాహెబ్ వెన్నంటి నడిచారని ఆయన వివరించారు. బాబా సాహెబ్ విషయంలో హోమ్ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను సమావేశం తీవ్రంగా ఖండించింది. ఫాసిస్టు శక్తుల కుట్రలను తిప్పికొట్టేందుకు దళితులు, ముస్లిములు ఏకమై ఒక కార్యాచరణ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని అబ్దుల్ షుఐబ్ అన్నారు.

**- అబ్దుల్ హకీమ్**

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




# డ్రగ్స్ నిర్మూలన మత గురువుల కర్తవ్యం

◆ చిన్నప్పుడే పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి ◆ యువత ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలి

## తీర్మానించిన ధార్మిక జన మోర్చా సమావేశం

**నేటి యువతరం** మద్యం, మాదక ద్రవ్యాల మత్తులో జోగుతోందని... వాటిని నిర్మూలించాల్సిన బాధ్యత మత గురువులపైనా ఉందని వివిధ మతాల గురువులంతా ముక్త కంఠంతో తీర్మానించారు. బంగారు భవిష్యత్తు కలిగిన యువతను నిర్వీర్యం చేస్తున్న మత్తు పదార్థాల ముప్పును అరికట్టడంలో మత గురువులు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని పలువురు మత గురువులు పిలుపునిచ్చారు. హైదరాబాద్ లక్టీకాపూల్‌లోని హెూటల్ అశోకలో ధార్మిక జనమోర్చా ఆధ్వర్యంలో 'మాదక ద్రవ్యాల ముప్పును అరికట్టడంలో మత గురువుల పాత్ర' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహించిన ధార్మిక జనమోర్చా నేషనల్ కన్వీనర్ డా.సలీమ్ ఇంజనీర్ మాట్లాడుతూ.. సామాజిక జాడ్యాలను నిర్మూలించేందుకు అన్ని మతాల గురువులు ఒకే వేదిక మీదకు రావాలని పిలుపునిచ్చారు. నేడు సమాజంలో పెచ్చరిల్లిపోయిన మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అన్ని మతాల గురువులు, మత పెద్దలు కలిసికట్టుగా ఏకతా సందేశం ఇవ్వాలని సలీం ఇంజినీర్ కోరారు. సమాజ హితం కోసం పనిచేసేలా అన్ని మతాల ధర్మగురువులతో కలిసి ధార్మిక జనమోర్చాను 2001లో ఢిల్లీలో ప్రారంభించామని ఆయన చెప్పారు. దేశం కోసం సమాజం కోసం తామంతా కలిసి పని చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా, మానవత్వం, నైతిక విలువలను పెంపొందేలా అన్యాయాలు, అత్యాచారాలకు వ్యతిరేకంగ మానవత్వం, నైతిక విలువలను పెంపొందేలా తామంతా కలిసి పోరాడుతామని సలీ ఇంజినీర్ చెప్పారు. మతాలు వేరైనా ఎలాంటి అనుమానాలు లేకుండా ఒకరినొకరు గౌరవించుకునేలా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కలిసి పోరాడుదామని ఆయన పిలుపునిచ్చారు. మద్యం, మాదక ద్రవ్యాల వల్ల ఏటా లక్షలాది మంది ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకులు లక్ష్మీ నరసింహులు మాట్లాడుతూ పిల్లలకు బాల్యం నుంచే భక్తిని అలవర్చాలని.. అలా చేస్తే పెద్దయ్యాక వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. మత్తు కలిగించే, ఆరోగ్యానికి హానికరమైన డ్రగ్స్‌ను ప్రభుత్వాలు ఎందుకు నిషేధించడం లేదని ప్రశ్నించారు ఆధ్యాత్మిక గురువులు

సామాజిక బాధ్యత కోసం సమయం కేటాయించాలని జమాఅతె ఇస్లామీ హింద్ నాయకురాలు డాక్టర్ అస్రా మొహసినా కోరారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహంగా ఉండి, వారి సమస్యలను పరిష్కరిస్తే వారిని డ్రగ్స్‌కు దూరంగా ఉంచొచ్చని తెలిపారు. లేకపోతే పిల్లలు చెడ్డవారితో స్నేహం చేసి దారి తప్పే అవకాశాలు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలను చదువులతో పాటు ఆటల్లో ప్రోత్సహించాలని, ఎన్.సి.సిలో వారికి తర్ఫీదు ఇస్తే వ్యసనాల బారి నుంచి తప్పించవచ్చని సందీప్ థాకూర్ అన్నారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల లభ్యత, యువత వాటికి బానిస కావడం అధికం కావడంపై ధార్మిక జనమోర్చా స్టేట్ కన్వీనర్ ఆతిఫ్ ఇస్మాయిల్ ఆందోళన వ్యక్తం చేశారు. లింగాయత్ మఠం ప్రతినిధి ప్రభుదేవ స్వామిజీ మాట్లా డుతూ యువత వ్యసనాల బారిన పడకుండా కాపాడుకోవడం పెద్దల కర్తవ్యమని అన్నారు.

పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య దూరం పెరిగిందని, తల్లిదండ్రులు పిల్లలను పట్టించుకోవడం లేదని, దీనివల్ల పిల్లలు మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటు పడి మత్తులో జోగుతు న్నారని జైన మత ప్రతినిధి ఖుషీ జైన్ చెప్పారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడటం, ఒత్తిడికి లోనవడం వల్ల వారు మత్తుకు బానిసలవుతున్నారని ఆమె ఆందోళన వెలిబుచ్చారు. పిల్లలతో తల్లిదండ్రులు అనుబంధం పెంచుకొని వారిని వ్యసనాల బారిన పడకుండా చూడాలని ఖుషీ జైన్ సూచించారు.

### వ్యసనాలకు బానిస కావద్దు : ఫాదర్ అంతయ్య, కేథలిక్ చర్చ్,

మద్యం, మాదకద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాల వ్యసనాలకు బానిసలుగా మారొద్దని సిఖ్ విలేజ్ కేథలిక్ చర్చ్ ఫాదర్ అంతయ్య కోరారు. మనిషి శరీరం అంటే అది దేవుని నివాసమని బైబిల్ చెబుతుందని, అలాంటి దేవుడు నివాసమున్న శరీరంలోకి మత్తు పదార్థాలు తీసుకోవడం చాలా పెద్ద తప్పు అని అంతయ్య వ్యాఖ్యానించారు. డ్రగ్స్ పెడ్లర్లపై చర్యలు తీసుకొని మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించాలని అంతయ్య సూచించారు.




### మత్తులో జోగుతున్న బడి పిల్లలు!

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల ముప్పు స్కూళ్లకూ పాకిందని నార్కోటిక్ డీఎస్పీ సుబ్బిరామిరెడ్డి ఆందోళన వెలిబుచ్చారు. గంజాయి ముఠాలు పిల్లలకు చాక్లెట్ల రూపంలో గంజాయిని అలవాటు చేస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు 111 రకాల డ్రగ్స్ ఉండేవని ఇప్పుడు 250 రకాల డ్రగ్స్ అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, దినచర్యపై ఓ కన్నేసి ఉంచాలన్నారు.

### డ్రగ్స్‌కు వ్యతిరేకంగా వీడియో ప్రదర్శన

డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఓ యువకుడు మృత్యువాత పడి, తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చిన వైనంపై వీడియో చిత్రాన్ని తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ప్రదర్శించింది. డ్రగ్స్ మహమ్మారి బారిన పడి యువత ఏ విధంగా నష్టపోతుందనే విషయంపై వీడియోలో ప్రదర్శించారు.

**- ముహమ్మద్ ముజాహిద్**

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




**ఈ విశ్వానికి** ఒకే ఒక సృష్టికర్త ఉన్నాడంటుంది ఇస్లాం. సమస్త ప్రాణికోటిలో అత్యుత్తమ సృష్టి మనిషి అని అది ఖరారు చేసింది. ఇస్లాం ప్రకారం జన్మతః మనుషులందరు సమానం. ఎవరూ ఎక్కువ కాదు. ఎవరూ తక్కువ కాదు. ఏ శిశువు కూడా జన్మతః పాపభారంతో జన్మించడం జరగదు. ప్రతి శిశువూ సహజస్వభావం అత్యంత అమాయకత్వమే. దైవం ప్రతీ వ్యక్తి లోను మంచీచెడుల నైతికతను నిక్షిప్తం చేశాడు. దీనివల్ల ప్రతి మనిషి సత్యాసత్యాలను, మంచీ చెడులను, ధర్మాధర్మాలను గుర్తించగలడు. మనిషికి దైవం అంతరాత్మను కూడా ఇచ్చాడు. తప్పు చేసినప్పుడు అంతరాత్మ నిందిస్తుంది. సృష్టికర్త మనిషికి బుద్ధిజ్ఞానాలనిచ్చాడు. వీటిని ఉపయోగించి తప్పొప్పులు గుర్తించగలడు. కాని, పిల్లలు పెరిగి పెద్దవుతున్నప్పుడు పరిసరాల ప్రభావాలకు గురవుతారు. మంచివారు పరిసరాల చెడు ప్రభావాలకు దూరంగా ఉంటారు. సంస్కరణ, ప్రక్షాళనలను పాటిస్తారు. చెడ్డవారు పరిసరాల చెడుకు ప్రభావితులై చెడుల్లో కూరుకు పోతారు. మనిషి సరయిన హితబోధ పొందాలంటే కేవలం నైతికత, బుద్ధిజానాలు మాత్రమే సరిపోవు. మానవ జీవితంలో ఎదురయ్యే ప్రశ్నలన్నింటికీ సమాధానాలు పొందే ముఖ్యమైన మార్గం దైవవాణి. ఇది దైవప్రవక్తల ద్వారా మానవాళికి అందించడం జరిగింది. సృష్టికర్త ప్రసాదించిన ధర్మం ఇస్లాం. ఇది వివిధ కాలాల్లో, దైవం ఎంచుకున్న దైవదాసులు (దైవప్రవక్తల) ద్వారా మానవులకు అందించడం జరిగింది. సృష్టికర్త తన ప్రవక్తలకు హితబోధను ఇచ్చి పంపించాడు. ఈ దైవప్రవక్తల్లో కొందరు దైవసందేశహరులు. దైవగ్రంథంతో వచ్చినవారు. ఈ దైవగ్రంథాల్లో విశ్వానికి సంబంధించిన మౌలిక వాస్తవాలను వివరించడం జరిగింది. ఈ విశ్వాన్ని ఎవరు సృష్టించారు? ఏ లక్ష్యంతో సృష్టించారు? ఈ విశ్వంలో మనిషి స్థానమేమిటి? మరణానంతరం మనిషి ఏమవుతాడు? వంటి ప్రశ్నలకు జవాబులు ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం విశ్వం చివరి దశలో ఉంది. ఎందుకంటే, చివరి దైవప్రవక్త ఆగమనం 1450 సంవత్సరాల క్రితమే జరిగిపోయింది. దేవుని చివరి దైవగ్రంథం యథాతథంగా మానవాళికి అందుబాటులో ఉంది. ఇక ప్రళయం వరకు మరో ప్రవక్త ఎవరూ రారు కాబట్టి, ఈ చివరి దైవగ్రంథాన్ని పరిరక్షించే బాధ్యత కూడా స్వయంగా అల్లాహ్‌యే స్వీకరించాడు.

ఇస్లాంలోని హితబోధ మనుషులందరినీ ఉద్దేశించిందని కూడా ఇస్లాం ప్రకటిస్తుంది. ఇస్లాం పదానికి శాంతి అని, ఆత్మసమర్పణ అని అర్థాలు ఉన్నాయి. ఈ రెండు అర్థాలను కలిపి చూస్తే, సృష్టికర్తకు పూర్తిగా విధేయుడై, తనను తాను అర్పించుకుని, మనిషి ప్రశాంతతను పొందడమే ఇస్లాం. ఈ విశ్వానికి సంబంధించిన ప్రాథమిక ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానం పొందినప్పుడు, మనిషి ప్రశాంతంగా తన జీవిత ప్రయాణాన్ని కొనసాగించగలడు. ఉదాహరణకు, ఒక ప్రయాణికుడిని బలవంతంగా వాహనంలో కూర్చోబెట్టి, కళ్లకు గంతలు కడితే, ఆ ప్రయాణం గురించి, తన గమ్యం గురించి అతనిలో అలజడి, కల్లోలమే ఉంటుంది. కానీ,

ప్రయాణికుడికి తన ప్రయాణ ప్రారంభస్థలం, తన గమ్యం, ప్రయాణ ఉద్దేశ్యం తెలిసి ఉంటే, అతనికి ఆ ప్రయాణం ప్రశాంతంగా ఉంటుంది. ఒకవేళ ప్రయాణంలో కష్టాలు ఎదురైనా అవి తాత్కాలికమే అని భరిస్తాడు. మరొక ఉదాహరణలో, ఒక వ్యక్తిని విమానంలో, బిజినెస్ క్లాస్‌లో అత్యంత సౌకర్యాలతో కూర్చోబెట్టినా, గమ్యం గురించి సమాచారం ఇవ్వకపోతే, అతనికి ఆ ప్రయాణం అసంతృప్తిగా ఉంటుంది. అందువల్ల, జీవిత ప్రయాణం ప్రశాంతంగా ఉండాలంటే, ఆ ప్రయాణానికి సంబంధించి పూర్తి అవగాహన అవసరం. జీవిత ప్రయాణంలో మనిషికి తన ప్రారంభం ఏమిటో, గమ్యమేమిటో, ప్రయాణ ఉద్దేశ్యమేమిటో తెలియనప్పుడు ఆ మనిషి వద్ద ఎంత సంపద ఉన్నా, ఎన్ని సదుపాయాలున్నప్పటికీ సంతృప్తి ఉండదు.

ఇస్లాంలోని నైతిక, ఆధ్యాత్మిక వ్యవస్థ దైవప్రసన్నత లక్ష్యంగా కేవలం దైవమే ప్రధానంగా జీవించాలని చెబుతుంది. ప్రతి వ్యక్తి దైవంతో అనుబంధాన్ని కలిగి ఉండాలి. ఈ అనుబంధం ఏర్పడడానికి కొన్ని ఆరాధనలు నిర్దేశించబడ్డాయి. అవి నమాజ్, జకాత్, రోజా, హజ్ మొదలైనవి. మనిషి తన సృష్టికర్తను ప్రత్యక్షంగా చూడకపోయినా బుద్ధిజ్ఞానాల ద్వారా దైవచిహ్నాలను గుర్తించి సృష్టికర్తను విశ్వసించడం మనిషి వివేకానికి పరీక్ష.

ఈ పరీక్షలో రెండో భాగం సృష్టికర్తను విశ్వసించిన తర్వాత ఆ విశ్వ ప్రభువుకు కృతజ్ఞుడై, పూర్తిగా విధేయుడై జీవించాలి. తాత్కాలిక జీవితం ఒక పరీక్ష అని తెలుసుకోవాలి. తాత్కాలిక జీవితంలోని ఈ పరీక్షకు ఒక రోజు ఫలితాలు వెల్లడవుతాయని విశ్వసించాలి. ఆ రోజు ప్రపంచం అంతమై, ప్రతి మనిషిని తిరిగి బతికించడం జరుగుతుంది. తీర్పుదినం నెలకొంటుందని విశ్వసించాలి. ఈ ప్రపంచంలో సాధ్యపడని న్యాయం ఆ రోజున జరుగుతుంది. దైవ విశ్వాసంతో, సదాచరణలతో జీవించినవారు ఆ రోజున శాశ్వత స్వర్గంలోకి ప్రవేశిస్తారు. సృష్టికర్తను గుర్తించక, అవిధేయత, అవిశ్వాసం చూపించినవారు శాశ్వత నరకంలోకి వెళ్తారు.

పరలోక విశ్వాసం మనిషి జీవితంపై గొప్ప ప్రభావం వేస్తుంది. బాధితులకు తమ పట్ల న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్నిస్తుంది. పరలోకంలో న్యాయం జరుగుతుందనే ఆశ వల్ల న్యాయానికి, ధర్మానికి కట్టుబడిన వారు పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నప్పటికీ స్థిరంగా తమ వైఖరిపై నిలబడతారు. ధర్మాన్ని పాటించే వారిలో సాహసం, పట్టుదల పెరుగుతుంది. పరలోకంలో లభించే ప్రతిఫలం కోసం మనిషి నిజాయితీగా సదాచరణలు పాటిస్తాడు. ఈ క్రమంలో ఎలాంటి కష్టాలు ఎదురైనా మడమ తిప్పడు. పాపాలు, అపరాధాలు ఎంత ఆకర్షణీయంగా కనిపించినా సరే పరలోక ప్రతిఫలాపేక్ష వల్ల వాటికి దూరంగా ఉండే మనోబలం లభిస్తుంది.

**(ఇంకావుంది)**

## 1.29 మిలియన్ల వైద్యులలో కేవలం లక్షకు పైగా ముస్లిం ఎంబిబిఎస్‌లు ఉన్నారు

**భారతదేశం**లోని ముస్లింలు - గ్రౌండ్ రియాలిటీ వెర్సెస్ ఫేక్ నేరేటివ్స్ - అచీవ్‌మెంట్స్ అండ్ అకాంప్లిష్‌మెంట్స్ Muslims in India - Ground Reality Verses Fake Narratives - Achievements & Accomplishments అనే కొత్త పుస్తకంలో పొందుపరచబడిన వివరాల ప్రకారం

దేశవ్యాప్తంగా మొత్తం ఉన్న 12,99,254 మంది వైద్యులలో ముస్లిం ఎంబిబిఎస్ వైద్యుల సంఖ్య కేవలం 1,04,062గా ఉంది.

➢ దేశవ్యాప్తంగా 3,242 మంది ముస్లింలు ఆయుర్వేద మెడిసిన్ ప్రాక్టీషనర్లున్నారు.

➢ దేశవ్యాప్తంగా ఉన్న యునాని మెడిసిన్ ప్రాక్టీషనర్లు మొత్తం 28,778 మంది వారిలో ముస్లింలు 28,061 మంది ఉన్నారు.

➢ దేశవ్యాప్తంగా మొత్తం హోమియోపతి ప్రాక్టీషనర్లు 2,23,531 మంది ఉండగా వారిలో ముస్లిం హోమియోపతి ప్రాక్టీషనర్లు 70,027 మంది ఉన్నారు.

➢ నేషనల్ మెడికల్ కమిషన్, రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (RCI), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ICMR) సీనియర్ సభ్యులు, టాప్ మేనేజ్‌మెంట్‌లలో ముస్లింలు ఎవరూ లేరు.

➢ దేశంలోని అన్ని రాష్ట్ర వైద్య మండలి అధ్యక్షులు, రిజిస్ట్రార్లలో ఇద్దరు ముస్లింలు మాత్రమే ఉన్నారు.

➢ నర్సింగ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో మొత్తం 34 మంది అధికారులు ఉన్నారు వారిలో ఒకరు ముస్లిము..

➢ హైదరాబాద్ మెడికల్ కౌన్సిల్‌లో 1960-1989 మధ్య మొత్తం 12,157 మంది వైద్యులు ఉన్నారు. వారిలో 2,277 మంది ముస్లింలు.

➢ 1960- 2022 మధ్య ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌లో మొత్తం 93,324 మంది వైద్యులు ఉండగా వారిలో6,675 మంది ముస్లిములు.

➢ మణిపూర్, మిజోరాం, నాగాలాండ్‌లో ముస్లిం వైద్యులు లేరు

మూలం: క్లారియన్ ఇండియా, డిసెంబర్ 31, 2024


**- ముహమ్మద్ అజ్గర్ అలీ.**


'చరితార్థులు'-2

# బతఖ్ మియాఁ అన్సారి

## (1869 -1957)

71






**ఆంగ్లేయులు** కల్పిస్తామన్న మంచి ఉద్యోగం, అందిస్తామన్న ఆర్థిక సహాయాన్ని తృణీకరించి మహాత్మా గాంధీ మీద సాగాల్సిన విష ప్రయోగాన్ని వమ్ము చేసిన బతఖ్ మియాఁ అన్సారి బీహార్ రాష్ట్రం మోతిహారీ గ్రామంలో 1869 జూన్ 25న జన్మించారు. తల్లి ఇంరా ఖాతూన్, తండ్రి మహమ్మద్ అలీ మియాఁ అన్సారి. ఆంగ్లేయ ప్లాంటర్లు చంపారన్ రైతాంగంపై క్రూర చర్యలకు పాల్పడుతున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు 1917లో గాంధీజీ బీహార్ రాష్ట్రం చంపారన్ వచ్చారు. ఆయన స్థానిక రైతులను కలసి విచారణ ప్రారంభించగా, ఆ విచారణలో తమ కిరాతకాలు బయట పడతాయన్న భయంతో ఆంగ్లేయ ప్లాంటర్ ఇర్విన్ నేతృత్వంలో గాంధీజీని విందుకు ఆహ్వానించి విషాహారం ద్వారా అంతం చేయాడానికి కుట్రపన్నారు. ఆ పనికి తన వద్ద పనిచేస్తున్న వంటమనిషి బతఖ్ మియా అన్సారిని ఆంగ్లేయుడు ఇర్విన్ ఎన్నుకున్నాడు. తాను చెప్పినట్టు నడుచుకుంటే స్వర్గసుఖాలలో ముంచెత్తుతానని లేనట్టయితే భయంకర నరకం చూపుతానని హెచ్చరించాడు. అన్సారి ఆ హెచ్చరికలను ఖాతరు చేయలేదు. ఇర్విన్ విందుకు వచ్చిన గాంధీజీ ఎదుట ఆంగ్లేయుడి కుట్రను బట్టబయలు చేసి మహాత్ముడు విషాహారానికి బలికాకుండా ఆయన కాపాడారు. ఆ కారణంగా ఆంగ్లేయ ప్లాంటర్ల ఆగ్రహానికి గురైన అన్సారి ఉద్యోగం పోగొట్టుకుని, అరెస్టుకు గురయ్యారు, చిత్రహింసలకు గురయ్యారు, అంతేకాకుండా ఆస్తి జప్తు అయ్యింది, చివరకు గ్రామం నుండి వెళ్ళగొట్టబడ్డారు. 1917నాటి ఈ సంఘటనకు ప్రత్యక్షసాక్షి డాక్టర్ రాజేంద్రప్రసాద్ 1950లో భారతదేశం ప్రథమ రాష్ట్రపతి హోదాలో బీహార్ రాష్ట్రం మోతిహారీ వచ్చినప్పుడు బతఖ్ మియాఁ అన్సారిని గుర్తు పట్టి గౌరవించి, అలనాటి విశిష్ట చారిత్రక సంఘటనను బహిరంగ సభలో వివరించారు. అన్సారి పరిస్థితి తెలుసుకుని బాధ పడి 50 ఎకరాల భూమిని మంజూరు చేయాల్సిందిగా జిల్లా కలక్టరుకు ఆదేశాలిచ్చారు. అధికారుల అలక్ష్యం వలన రాష్ట్రపతి ఆదేశాలు పూర్తిగా అమలు కాకుండానే 1957 డిసెంబర్ నాలుగున అన్సారి మృతి చెందారు. అది తెలుసుకున్న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ 1958 డిసెంబరు 3న అన్సారి కుటుంబీకులను రాష్ట్రపతి భవన్‌కు పిలిపించి యోగ క్షేమాలు కనుక్కున్నారు. ఆ తరువాత కూడా భారత స్వాతంత్ర్యోద్యమానికి దిక్సూచిగా నిలచిన మహాత్ముడి ప్రాణాలు కాపాడిన బతఖ్ మియాఁ అన్సారి సాహస చరిత్రకు ప్రాధాన్యత లభించలేదు. 1999లో సయ్యద్ ఇబ్రహీం ఫిక్రి రాసిన గ్రంథం ద్వారా కొంత సమాచారం వెలుగులోకి వచ్చాక 2010లో కొందరు రచయితలు, జర్నలిస్టులు, చరిత్రకారుల కృషి ఫలితంగా బతఖ్ మియాఁ ఆన్సారి చరిత్ర ప్రజా బాహుళ్యంలోకి బాగా వచ్చింది తప్ప అలనాటి భారత ప్రథమ రాష్ట్రపతి ఆదేశాలు మాత్రం ఈనాటికి పూర్తిగా అమలుకు నోచుకోలేదు. ✤



9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త
**సయ్యిద్ నశీర్ అహమ్మద్**
రూపొందించిన ఆల్బమ్
**'చరితార్థులు' - 2 (తెలుగు)**
THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి
గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# సమాజానికి పునాది కుటుంబం

**- అర్షియా**



**ఇస్లాం దృష్టిలో వివాహం ప్రేమాభిమానాల బంధం.** సమాజాన్ని సమిష్ఠిగా నిలపి ఉంచే పునాది. అందుకే ఆరోగ్య వంతమైన సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో వివాహ బంధానికి ఇస్లాం కొన్ని నియమ, నిబంధనలు ఏర్పరించింది. ప్రజలంతా వాటిని పాటించాలని ఖుర్ఆన్‌లో ఆదేశించింది. పెండ్లి చేసుకొనే శక్తి కలవారు, సంసార భారాన్ని మోయగలిగే వారు తప్పక పెండ్లి చేసుకోవాలని దైవప్రవక్త(స) సెలవిచ్చారు. శీలవతులైన వ్యక్తులను మాత్రమే పెండ్లి చేసుకోవాలి. స్త్రీ-పురుషుల మధ్య ఉండే ప్రేమాను రాగాలు, సంతృప్తే దాంపత్య బంధంలో ఆకర్షణగా నిలుస్తాయని తెలిపింది. వావి వరుసలు, స్తన్య బంధం, రక్త సంబంధాలు మరచి వివాహం చేసుకోకూడదని చెప్పింది. స్వలింగ సంపర్కాన్ని నిషేధించింది. అత్తమామలను తల్లిదండ్రులతో సమానంగా గౌరవించాలని పేర్కొంది. వివాహ బంధంతో ఒక్కటి కావాలనుకొనే యువతీ యువకులు పెళ్లి చూపులయ్యాక విచ్చలవిడిగా తిరగడాన్ని ఇస్లాం అంగీకరించదు. యువతులను జీవిత భాగస్వాములు చేసుకొనేటప్పుడు వారి అందచందాల కన్నా వారి నైతిక ప్రవర్తనకు, ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని దైవప్రవక్త(స) సూచించారు. సులభంగా, నిరాడంబరంగా పెండ్లి చేసుకొనేందుకు ఇస్లాం కొన్ని విధి విధానాలను రూపొందించింది. వితంతువుల వివాహాలను ప్రోత్సహించింది. వివాహ సమయంలో వధువుకు ఇవ్వాల్సిన మహర్ (కట్నం) సంతోషంగా ఇవ్వాలని, వాళ్లు దాంట్లో కొంత సంతోషంగా మాఫీ చేస్తే వరుడు దాన్ని అనుభవించవచ్చని ఖుర్ఆన్ తెలిపింది. ఇస్లాం ప్రకారం కుటుంబాన్ని ఒక సంస్థగా భావిస్తే అందులో పురుషుడిని అధ్యక్షుడిగా, స్త్రీని కార్యదర్శిగా భావించాలి. వారిద్దరూ వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి కుటుంబ, సమాజ హితానికి తమ వంతు పాటుపడాలి.

యువతరానికి విప్లవవాదం
చేతన వాదం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




నసీరా బేగం

**దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు;** ఈ ఇహలోక ప్రపంచం విశ్వాసి కోసం ఒక చెరసాల వంటిది. అంటే ఈ ప్రపంచంలో ప్రతి మనిషి జీవితం ఎన్నో మార్పులకు, ఒడిదొడుకులకు గురవుతూ ఉంటుంది. కాని ఒక సాధారణ మనిషి జీవితం కంటే ఒక విశ్వాసి జీవితం చాలా భిన్నంగా ఉంటుంది. అతనిపై వచ్చే ఆపదలు, పరీక్షలు అధికంగా ఉంటాయి. ఈ ఆపదలు అల్లాహ్ తన ప్రియమైన దాసుల కష్టాలకు గురి చెయ్యాలని ఎంత మాత్రమూ కాదు. దీనిద్వారా తన ప్రియ దాసుని స్వర్గంలోని స్థానాలను ఉన్నతం చెయ్యాలని. కనుకనే మనం ప్రవక్తలు, సహాబాల జీవిత గాథలను చదువుతూ ఉంటే వారి జీవితాలు ఎన్నో కష్టాలకు, కడగండ్లకు గురయ్యాయని తెలుసుకుంటూ ఉంటాము. వారిని తన సొంత వారు కూడా కష్టనష్టాల పాలుచేశారు. పరాయి వారు కూడా కష్టాలకు, నష్టాలకు గురిచేశారు కాని వారు సంతోషంగానే, సహనంగానే ఆ పరిస్థితులను ఎదుర్కొన్నారు. దాని కారణంగా ఈ ప్రపంచంలో అల్లాహ్ వారికి ఎన్నో అనుగ్రహాలను ప్రసాదించాడు. పరలోకంల తప్పకుండా వారికి ఉన్నత శిఖరాలు లభించవచ్చు.

కారుణ్యమూర్తి మహాప్రవక్త(స) ధర్మప్రచారం చెయ్యటం మొదలుపెట్టగానే అందరికంటే ముందు తన సొంత బాబాయి అబూలహబ్‌యే సత్యమార్గాన్ని అడ్డుకున్నాడు. ఆయన(స)కు ఎన్నో కష్టాలకు, బాధలకు గురిచేశాడు. చివరకు దైవప్రవక్త(స)గారి ఇద్దరు కుమార్తెల వివాహాలు అతని కుమారులతో జరిగి ఉన్నాయి. తన కొడుకుల ద్వారా ఆయన(స) కుమార్తెలకు విడాకులిప్పించేశాడు. అంతేకాదు, ఆయన (స) గారి సందేశాన్ని స్వీకరించిన వారికి కూడా బాధలకు గురిచేశాడు. అక్కడ ఏర్పడిన శత్రు సమూహం వారిని తమ ఇండ్లలో, తమ తమ నగరాల్లో కూడా అపరిచితులుగా చేసేశారు. చివరకు వారు తమ ఇండ్లను, తమ నగరాన్ని వదిలివేసి వలసపోయారు. దైవప్రవక్త(స), ఆయన(స) గారి సహచరులు ఈ కష్టాలన్నింటిని పంటి

బిగువన పట్టి ఉంచి సంతోషంగా ధర్మ ప్రచార కార్యక్రమాన్ని నెరవేర్చారు. చివరకు ఒకరోజు రానే వచ్చింది. అల్లాహ్ కృపతో ఒక చిన్న సందేశ బృందం ఒక మహా బృందంగా ఏర్పడింది. మక్కాపై విజయం సాధించింది. నైతిక విలువలతో కూడుకున్న ఈ బృందం ప్రపంచ ప్రజలందరికీ ఉన్నతమైన పాఠాలను బోధించే ఉత్తమ సమాజంగా ప్రఖ్యాతిగాంచింది.

వ్యక్తిగతంగా వారి జీవితాలపై దృష్టిని సారిస్తే ప్రతి వ్యక్తి ఉత్తమ నైతిక విలువలు గల, ఉత్తమ వ్యక్తిత్వం గల వ్యక్తిగా రూపొందాడు. వారి ప్రతి అడుగు అల్లాహ్ సూచించిన మార్గంపైనే నడిచేది. ఆ మార్గం ఎంత కఠినాతి కఠినమైనా సరే, వారు దానినే అనుసరించేవారు. ఎంతమాత్రమూ ఆందోళన చెందేవారు కాదు. అంతేకాదు, వారికి అల్లాహ్ కారుణ్యంపై అచంచలమైన విశ్వాసంతో ఆ కష్టాలను ఎదుర్కొనే వారు. వారి ఇంట్లో ఒకవేళ ఒక పూట కోసం సరిపడే భోజనమే ఉన్నా ఆ సమయంలో పస్తులున్నవారు ఎవరైనా వచ్చి అన్నం అడిగినట్లయితే తన ఆకలిని ప్రక్కన బెట్టి అతని ఆకలిని తీర్చి తమ ఇంటిల్లిపాది పస్తులుండేవారు.

వారి నరనరాల్లో దైవ విశ్వాసం జీర్ణించుకుపోయి ఉండేది. కనుకనే వారు అల్లాహ్‌కు అత్యంత ఇష్టమైన ఆచరణలనే చేసేవారు. అత్యంత జాగరూకతగా ఉండేవారి ద్వారా ఎప్పుడైనా, ఏదైనా చిన్న తప్పు జరిగినా అల్లాహ్ క్షమించే వరకు ఆయనతో క్షమాభిక్ష పెట్టమని కడుదీనంగా అభ్యర్థిస్తూనే ఉండేవారు.

ఇక ప్రళయదినం వరకు వచ్చే ప్రజలకు దైవప్రవక్త(స) గారి జీవితం ఆదర్శప్రాయం. ఇంకా ఆయన(స) గారి సహచరుల జీవితాన్ని కూడా మనం ఆదర్శంగా తీసుకోవచ్చు. దాని ద్వారా మన ఆత్మకు ప్రశాంతత లభిస్తుంది. మనం దైవప్రవక్త(స) గారి జీవితంపై ఆయనకు ఎదురైన పరీక్షలపై, ఆపదలపై, కష్టాలపై దృష్టిని సారించి మన జీవితాన్ని మన కష్టాలను, మన నష్టాలను, మన పరీక్షలను విశ్లేషించుకుంటే అవి మనకు బహు తక్కువగా, అతి తేలికైనవిగా కనిపిస్తాయి.

మన జీవిత పరీక్షలను కష్టపడి, సహనంతో ఎదుర్కోవాలి. పరీక్షలు, ఆపదలు వ్యక్తిగతంగా వచ్చిపడినా, మొత్తం సమాజంపై వచ్చి పడినా ఆందోళనకు, ఆత్రుతలకు గురికాకుండా పెడబొబ్బలు పెట్టకుండా రోదించకుండా, గుండెలు బాదుకోకుండా సహనంతో, స్థైర్యంతో ఎదుర్కోవాలి. అత్యంత వివేకంతో దాని నుంచి బయటపడేందుకు ప్రయత్నించాలి. ఇంకా సాధారణ రీతిలో కాకుండా ఇంకా అధికంగా అల్లాహ్‌ను స్మరిస్తూ ఉండాలి. చేసిన పాపకార్యాలను జ్ఞాపకం చేసుకుని అల్లాహ్‌ను పశ్చాత్తాపం పెట్టమని కోరుకోవాలి. అత్యధికంగా సత్కార్యాలు చెయ్యాలి. దుష్కార్యాలను విడనాడేందుకు పూర్తి ప్రయత్నం చెయ్యాలి. అల్లాహ్ అనుగ్రహాలపై దృష్టిని సారించి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపు కోవాలి. మనకు లభించిన అనుగ్రహాలపై కృతజ్ఞతలు గనక అర్పించుకున్నట్లయితే మన వద్ద లేని అనుగ్రహాలు, మనకు అవసరమైన అనుగ్రహాలను కూడా అల్లాహ్ తప్పకుండా ప్రసాదిస్తానని వాగ్దానం చేస్తున్నాడు.

ముఖ్యంగా మనం కొన్ని పరిస్థితులలో చాలా ఆందోళనకు గురవుతాము. ఉదాహరణకు, మన ఇంట్లో ఎవరైనా ఏదైనా పెద్ద అనారోగ్యానికి గురైతే, ఎవరైనా మరణిస్తే లేదా వ్యాపారంలో పెద్ద నష్టం జరిగితే ఇంకా అనుకోని సంఘటన ఏదైనా జరిగితే ఇలాంటి సమయంలో వాటిని ఎదుర్కోవటానికి, వాటి నుంచి బయటపడటానికి ఎన్నో ఉపాయాలు మన మనసులో ఉత్పన్నమవుతాయి. ఆ ఉపాయాలను వినియోగిస్తాము కూడా. బాహ్యాపరమైన ఈ ఆచరణ చేసినా అంతర్గతంగా మనిషి తనంతట తాను ఇలాంటి సమయాలలో ముఖ్యంగా అల్లాహ్ వైపునకు మరలుతాడు. అల్లాహ్‌కు అత్యంత చేరువైపోతాడు. అత్యంత చిత్తశుద్ధితో అల్లాహ్‌ను వేడుకుంటాడు. ఆ వేడుకోలులో అతని అగత్యపరమైన అసలు స్థితి ఉట్టిపడుతుంది. ఇలాంటి పరిస్థితిలో దాసుడు తన ప్రభువుకు నిజమైన పరిస్థితిలో సమీపమైపోతాడు. ప్రత్యేకమైన ఒక ప్రేమ, ఒక నమ్మకం ఏర్పడుతుంది. అల్లాహ్ తప్ప నన్ను గట్టెక్కించేవాడు ఎవ్వడూ లేడనే ఒక విశ్వాసం కలుగుతుంది.

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల సొపురాయి
గీటురాయి
వారపత్రిక




## రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత వైద్యం

రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు కొత్త పథకాన్ని ప్రారంభించనున్నట్టు కేంద్ర రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ పథకం కింద ప్రమాద బాధితులకు ఏడు రోజుల పాటు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత ఉచిత వైద్యాన్ని అందించనున్నట్టు చెప్పారు. ప్రమాద సమాచారాన్ని 24 గంటల్లో పోలీసులకు అందిస్తే ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని మార్చి నుంచి దేశమంతా విస్తరించనున్నట్టు తెలిపారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు ఇప్పుడు ఇస్తున్న రూ.5000 సాయాన్ని పెంచనున్నట్టు చెప్పారు. జనవరి 8న అన్ని రాష్ట్రాల రవాణా శాఖ కార్యదర్శులు, కమిషనర్లతో సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. ట్రక్కుల వల్ల 2022లో జరిగిన ప్రమాదాల్లో 33 వేల మంది మరణించినట్టు చెప్పారు.

## ఇస్రో చైర్మన్‌గా నారాయణన్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తదుపరి చైర్మన్‌గా డాక్టర్ వీ నారాయణన్ నియమితులయ్యారు. ప్రస్తుత చైర్మన్ ఎస్ సోమనాథ్ పదవీకాలం ముగియనుండటంతో జనవరి 14న నారాయణన్ బాధ్యతలు చేపట్టనున్నారు. నారాయణన్ సారథ్యంలో చంద్రయాన్-4, గగన్‌యాన్, శుక్రయాన్, మంగళ్‌యాన్-2, పునర్వినియోగ వాహకనౌక తయారీ వంటి కీలక ప్రాజెక్టులను ఇస్రో చేపట్టనుంది. 1984లో శాస్త్రవేత్తగా ఇస్రోలో చేరిన నారాయణన్ నాలుగు దశాబ్దాలుగా అనేక కీలక ప్రాజెక్టుల్లో భాగస్వాములయ్యారు. ఆయన నాయకత్వంలో పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ సహా అనేక ఇస్రో ప్రయోగాలకు ఎల్పీఎస్సీ 183 లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్‌లు, కంట్రోల్ పవర్ ప్లాంట్లను అందించింది. చంద్రయాన్-2, చంద్రయాన్-3, ఆదిత్య స్పేస్‌క్రాఫ్ట్ ప్రయోగాల్లోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. జీఎస్ఎల్వీ ఎంకే III వాహక నౌకకు సంబంధించిన సీ25 క్రయోజెనిక్ ప్రాజెక్టుకు ఆయన ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేశారు.

## ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్ కుమార్ ప్రకటించారు. ఈ నెల 10వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 17వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉంటుంది. 18న నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుంది. 20వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుంది. ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగుతుంది. 8న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయి.

## వంట నూనెలతోనూ.. క్యాన్సర్ ముప్పు!

ఇళ్లలో, రెస్టారెంట్లలో వాడే సన్‌ఫ్లవర్ ఆయిల్, ద్రాక్ష గింజల నూనె, కనోలా, మొక్కజొన్న నూనెలతో కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని అమెరికా శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో వెల్లడైంది. పెద్ద పేగు క్యాన్సర్ ముఖ్యంగా యువకుల్లో ఈ తరహా కేన్సర్ పెరుగుదలకు ఈ వంట నూనెలే కారణమని తేలింది. అధ్యయనంలో భాగంగా 30 నుంచి 85 ఏళ్ల మధ్య వయసున్న 80 మంది పెద్దపేగు కేన్సర్ రోగుల కణితలను పరిశీలించి ఈ విషయాన్ని గుర్తించారు. వారి కణితుల్లో చాలాఎక్కువ స్థాయిలో బయోయాక్టివ్ లిపిడ్లు ఉన్నాయి. విత్తనాల నుంచి వచ్చే నూనెల వాడకం వల్ల.. బయోయాక్టివ్ లిపిడ్లు అధికంగా పెరుగుతున్నాయని పరిశోధకులు కనుగొన్నారు.

## జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం

జమిలి ఎన్నికలపై తీసుకువచ్చిన రెండు బిల్లులపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ ప్యానెల్ మొదటి సమావేశం అధికార, విపక్ష నేతల వాదోపవాదాలతో దద్దరిల్లింది. జమిలి ఎన్నికల బిల్లు రాజ్యాంగం, సమాఖ్యవాద ప్రాథమిక నిర్మాణంపై దాడిగా విపక్ష ఎంపీలు వర్ణించగా, ఇది ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేదిగా ఉందని బీజేపీ ఎంపీలు సమర్థించారు. 39 మందితో ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ తొలి సమావేశంలో బిల్లు ఉద్దేశాలు, లక్ష్యాలు, అందులో పొందుపరిచిన అంశాలను న్యాయ శాఖ తొలుత వివరించింది. ఈ సందర్భంగా పలువురు విపక్ష ఎంపీలు జమిలి ఎన్నికల కారణంగా ఖర్చు తగ్గుతుందన్న కేంద్రం వాదనను నిలదీశారు. అసలు ఒకే ఎన్నిక విధానం అన్న మాటే రాజ్యాంగ విరుద్ధమని, సమాఖ్యవాద ప్రాథమిక నిర్మాణంపై దాడి అని కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ ఎంపీలు విమర్శించారు.




## తప్పుడు సమాచార వ్యాప్తి నిరోధానికి కొత్త విధానం

తమ వేదికలపై తప్పుడు సమాచార వ్యాప్తిని నిరోధించడానికి మెటా కొత్త విధానాన్ని ప్రారంభించనుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ యాజమాన్య సంస్థ అయిన మెటా ఇప్పటి వరకు సమాచారాన్ని ధ్రువీకరించేందుకు థర్డ్ పార్టీ ఫ్యాక్ట్ చెకర్లపై ఆధారపడేది. అయితే, వీరు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. దీంతో తప్పుడు సమాచారానికి అడ్డుకట్ట పడటం లేదు. ఈ నేపథ్యంలో థర్డ్ పార్టీ ఫ్యాక్ట్ చెకర్లను పూర్తిగా పక్కన పెట్టేయాలని మెటా నిర్ణయించింది. దీని బదులు కొత్తగా 'కమ్యూనిటీ నోట్స్' అనే ఫీచర్‌ను తీసుకురానున్నది. ఈ ఫీచర్‌తో తప్పుదోవ పట్టించే పోస్టులకు యూజర్లు వారి అభిప్రాయాన్ని రాసే అవకాశం ఉండనుంది.

## అక్కడ ఒకే ఏడాదిలో 900కు పైగా ఉరిశిక్షలు అమలు..!

సాధారణంగా మన దేశంలో పౌరులకు ఎంతో తీవ్రమైన నేరాలకు పాల్పడితే తప్ప ఉరిశిక్షలు పడవు. అందుకే మన దేశంలో సగటున ఏడాదికి సింగిల్ డిజిట్‌కు మించి ఉరిశిక్షలు అమలు కావు. కానీ ఆ దేశంలో మాత్రం తీవ్రత తక్కువగా ఉన్న నేరాలకు సైతం ఉరిశిక్షలు వేస్తారు. ఆ దేశం మరేదో కాదు. ఇరాన్ దేశం. ఇరాన్‌లో ఏటికేడు ఉరిశిక్షలకు గురయ్యే వ్యక్తుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. గత సంవత్సరం అంటే 2024 అయితే ఏకంగా 900 మందికిపైగా ఉరితీయబడ్డారు. అక్కడ ఏడాదిలో మొత్తం 901 మందిని ఉరితీసినట్లు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల చీఫ్ ఓల్కర్ టర్క్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్‌లో హత్యలకు పాల్పడినా, మాదకద్రవ్యాలను రవాణా చేసినా, అత్యాచారాలు, లైంగిక దాడులకు పాల్పడినా ఉరిశిక్ష విధిస్తారు. దాంతో ఏటా భారీ సంఖ్యలో ఉరిశిక్షలు అమలవుతున్నాయి. అయితే ఈ ఉరిశిక్షలపై హక్కుల సంఘాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సమాజంలో భయం నింపడానికి ఇలాంటి పెద్దపెద్ద శిక్షలు వేయిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా 2022, 2023 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తడం కూడా మరణశిక్షలు పెరగడానికి కారణమని ఆరోపిస్తున్నారు.

## గతేడాది అమెరికా పోలీసుల చేతుల్లో 1250 మంది మృతి

గతేడాది కాలంలో అమెరికా వ్యాప్తంగా పోలీసులు 1250మందికి పైగా హతమార్చారని పరిశోధనా గ్రూపు మ్యాపింగ్ పోలీస్ వయొలెన్స్ వెల్లడించింది. 2013 నుండి దేశంలో పోలీసుల హత్యల వివరాలను నమోదు చేస్తూ వచ్చిన ఈ సంస్థ ఆయా గణాంకాలను విడుదల చేసింది. గతంలో ఎన్నడూ ఇంతమంది చనిపోలేదని పేర్కొంది. ప్రభుత్వ రికార్డులు, వార్తా కథనాల ద్వారా పోలీసుల హత్యల వివరాలను ఈ సంస్థ తెలుసుకుంటూ వుంటుంది. గతేడాది డిసెంబరులో చివరి 13 రోజుల్లో పోలీసులు ఒక్కరిని కూడా చంపలేదని పేర్కొంది. సగటున ప్రతి 7గంటలకు ఒకరు చొప్పున పోలీసుల హింసలో చనిపోయారని ఈ గ్రూపు గుర్తించింది. పోలీసుల కాల్పులు, లాఠీచార్జి, పోలీసు వాహనాలు ప్రజలపైకి దూసుకెళ్ళడం వంటి ఘటనల్లో మరణించిన వారే వీరందరూ. వీరిలో దాదాపు 31శాతం అంటే 387మంది హింసాత్మక నేరాల్లో మరణించారు. మరో 18శాతం మంది అంటే దాదాపు 200మంది ట్రాఫిక్ ఉల్లంఘనల ఆరోపణలపై లేదా సంక్షేమ తనిఖీల కోసం పోలీసులను పిలిచిన తర్వాత చంపబడ్డారు. మరో 8 శాతం మంది ఎలాంటి నేరాలకు పాల్పడక పోయినా చనిపోయారు. ఇతర నేరాలకు పాల్పడిన వారు మరో 17శాతం మందని ఆ గ్రూపు పేర్కొంది. గ్రామీణ, శివారు ప్రాంతాల్లోనే ఎక్కువగా ఈ హత్యలు చోటు చేసుకున్నాయి.

## వర్షాలతో సౌదీ అరేబియా విలవిల..!

సౌదీ అరేబియా అనగానే మక్కా, మదీనా, ఎడారి చిత్రాలే కళ్ల ముందు కదలాడుతాయి. కానీ, ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. భారీ వర్షాల కారణంగా వరదలు పోటెత్తుతున్నాయి. మక్కా, మదీనా, జెడ్డా, గవర్నరేట్‌లోని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా వరదలు పోటెత్తడంతో భారీగా నష్టం వాటిల్లింది. భారీ వర్షాల కారణంగా సౌదీలోని పలు నగరాలు నీట మునిగాయి. ముమ్ముందు కూడా ఇలాంటి పరిస్థితి నెలకొంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. జాతీయ వాతావరణ కేంద్రం (NMC) ఈ వారంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఉరుములు, తుఫానులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. భారీ వర్షం కురిసేందుకు అవకాశం ఉందంటూ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఈ క్రమంలో ప్రజలు ఇంట్లోనే ఉండాలని.. అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని పరిపాలన హెచ్చరికలు చేసింది. ఎలాంటి ఘటన జరిగినా స్పందించేందుకు అత్యవసర సేవలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది. ఇక రాబోయే రోజుల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సూచనలు పాటించాలని నిపుణులు సూచించారు.

# షాబాన్ మాసం దాని ప్రాముఖ్యత

ముహమ్మద్ వహీదుద్దీన్

**ఇస్లామీయ నెలల్లో 8వ నెల షాబాన్.** పన్నెండు నెలల్లో షాబాన్ నెలకు ఓ ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే షాబాన్ నెలని అంతిమ ప్రవక్త ముహమ్మద్(స) తన నెలగా పేర్కొన్నారు.

హ॥జ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం అంతిమ ప్రవక్త(స) ఒక సందర్భంలో ఇలా ఉపదేశించారు : షాబాన్ నా నెల. రజబ్ అల్లాహ్ నెల. రమజాన్ నా జాతి నెల. షాబాన్ నెల మానవులను పాపాల నుండి దూరం చేస్తుంది, రమజాన్ నెల పరిశుభ్రం చేస్తుంది.

షాబాన్ నెల గురించి మహాప్రవక్త(స) గారు ఒక నెల ముందు నుంచే ప్రార్థించేవారు. మాకు రజబ్, రమజాన్ మధ్య గల నెల షాబాన్ నెల. ప్రజలు దీని ప్రాముఖ్యత నుండి అలక్ష్యంలో ఉన్నారు. ఈ నెలలో దాసుల కృత్యాలు అల్లాహ్ వద్దకు తీసుకుని వెళ్ళే సమయంలో నేను ఉపవాస దీక్షలో ఉండటాన్ని ఇష్ట పడతాను'' అని మహాప్రవక్త(స) సెలవిచ్చారు :

మహాప్రవక్త(స) షాబాన్ మాసంలో ప్రత్యేక ఉపవాసాలను పాటించేవారు. హ॥జ్రత్ ఆయిషా(రజి) ఇలా సెలవిచ్చారు : నేను మహాప్రవక్త(స) రమజాన్ నెల తప్ప మరే నెలలో మొత్తం నెల ఉపవాసాలుండటాన్ని ఎప్పుడు చూడలేదు. షాబాన్ మాసంలో అత్యధికంగా ఉపవాసాలు పాటించడం మరే నెలలో చూడలేదు. (బుఖారీ, ముస్లిమ్)

హ॥జ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త(స) ఈ విధంగా సెలవిచ్చారు : షాబాన్ నెల సగభాగం తర్వాత ఉపవాసాలు పాటించకండి. అంటే షాబాన్ నెల చివరి పదిహేను రోజులు ఉపవాసాలు పాటించకూడదు. ఎందుకంటే ముస్లింలు ప్రతి విషయంలో కూడా నన్నే అనుసరించి ఎక్కువ ఉపవాసాలు పాటిస్తే శారీరక బలహీనత ఏర్పడి రాబోయే రమజాన్ నెల ఉపవాసాలకు కావలసిన శక్తి లోపిస్తుంది. రమజాన్ నెల ఉపవాసాలు విధిగా పాటించాల్సి ఉంటుంది. కాబట్టి తన జాతి గురించి ఎల్లప్పుడు, ప్రతిక్షణం తపించే విశ్వకారుణ్యమూర్తి మహాప్రవక్త(స) షాబాన్ నెల ఉపవాసాల ద్వారా రమజాన్ నెల ఉపవాసాల్లో ఎలాంటి ఆటంకం జరగకూడదనే ఉద్దేశంతో చాలా స్పష్టంగా ఇలా సెలవిచ్చారు : “ఇజన్ తనఫ షాబాను ఫలా తసూమూ'' (తిర్మిజీ)

షాబాన్ మాసం సగభాగం తర్వాత ఉపవాసాలు పాటించకండి. అంటే షాబాన్ నెల మొదటి పదిహేను రోజులు ఉపవాసాలు పాటించి పదిహేను రోజులు ఉపవాసాలు విరమించాలి.

హ॥జ్రత్ ఆయిషా(రజి) ఉల్లేఖనం ప్రకారం తన వద్ద ఒక స్త్రీ రజబ్ నెల ఉపవాసాల గురించి ప్రస్తావన చేయగా ఆమె (రజి) గారు ఇలా సెలవిచ్చారు: ఒకవేళ నీకు రమజాన్ నెల ఉపవాసాల తర్వాత వేరే నెలలో ఉపవాసాలను పాటించాలనే ఆసక్తి ఉంటే షాబాన్ నెలలో ఉపవాసాలను పాటించు. ఎందుకంటే ఈ నెల గురించి అనేక శుభాలు ప్రస్తావించబడ్డాయి. (కంజుల్ ఆమాల్ 341/4)

దీని సారాంశం ఏమిటంటే షాబాన్ నెలలో ఉపవాసాలను పాటించవచ్చు, పూర్తిగా నిషేధించబడలేదు. ఇంకా ఇది మహా గొప్ప కార్యం కూడాను.

హ॥జ్రత్ అబ్దుల్ ఖాదర్ జిలాని (రహ్మ) ఇలా సెలవిచ్చారు : ఈ నెలలో శుభాలు సమృద్ధిగా ప్రసాదించబడతాయి. పుణ్యాలు ప్రసాదించబడతాయి. పాపాలు దూరం చేయబడతాయి. కాబట్టి ప్రతి తెలివి గల విశ్వాసి ఈ నెలలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదు. అశ్రద్ధ వహించకూడదు. రమజాన్ నెలను స్వాగతించే విధంగా తనకు తాను సంసిద్ధులుగా చేసుకోవాలి. పశ్చాత్తాప పడాలి. ఈ నెలలో ఎక్కువ ప్రార్థనలు చేసి దైవ సామీప్యాన్ని పొందాలి.

తుదిగేటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**